ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 18 జూలై 2025

20 వరకు జీఎన్‌టీ రోడ్డు రైల్వేగేటు మూసివేత

ఏలూరు క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు - దెందులూరు రైల్వే స్టేషన్ మధ్య లెవెల్ క్రాసింగ్ నంబర్ 351(489/15-17) కిలోమీటర్ వద్ద అత్యవసర మరమ్మతుల పనులు ఇంకా పూర్తి కానందున జూలై 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రైల్వే గేటును మూసివేయనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీరు ఎస్.లోకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు - దెందులూరు రైల్వేస్టేషన్ మధ్య ఏలూరు జీఎన్‌టీ రోడ్డు నుంచి నిమ్మకాయల మార్కెట్ యార్డుకు వెళ్లే రహదారిలో ప్రయాణించే వాహన దారులు ప్రత్యామ్నాయ రహదారి మీదుగా ప్రయాణించాల్సిందిగా సూచించారు.

ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక వాడ : కలెక్టర్

ఏలూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. ఏపీ సచివాలయం నుంచి ఆయన వివిధ అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికవాడల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు పాల్గొన్నారు.



నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేస్తున్న ఏఎంవో శ్రీనివాసరావు

కుక్కునూరులో విద్యార్థి సంఘాల దీక్షలు విరమణ

కుక్కునూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల భర్తీ కోసం కుక్కునూరులో నిర్వ హిస్తున్న రిలే దీక్షలు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ హామీతో గురువారం విరమించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాలు భర్తీ చేయాలని రెండురోజులుగా విద్యార్థి సంఘాలు పలు పార్టీల నాయకుల ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏఎంవో శ్రీనివాసరావు డీఈవోతో ఫోన్‌లో విద్యార్థిసంఘం నాయకుల చేత మాట్లాడించారు. విద్యావలంటీర్లను నియమించి చదువులకు ఆటంకం లేకుండా చూస్తామని డీఈవో హామీ ఇవ్వడంతో రిలే దీక్షలు విరమించారు. కార్యక్రమంలో వై.నాగేంద్రరావు, కొన్నే లక్ష్మయ్య, కే.లెనిన్, వడ్డే రఘు, చంటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లిక్ కాని.. క్లినిక్‌లు!

వైసీపీ హయాంలో ఆర్భాటం

- విలేజ్ క్లినిక్‌ల్లో వైద్య సేవలు అంతంత మాత్రం
- కొన్నింటికి భారీ వ్యయంతో భవనాలు
- మరికొన్ని మూలనపడి శిథిలావస్థకు..
- స్థానికంగా పర్యవేక్షణ, జవాబుదారీతనం లేదు

ఆంధ్రజ్యోతి విజిట్



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఒకప్పుడు మండల స్థాయిలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సదుపాయం అందించేవారు. ఆరేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన వైసీపీ వైద్యరంగంలో సరికొత్త మార్పులంటూ హంగామా చేసి ప్రతీ గ్రామంలో వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ప్రాంతాల్లో అర్బన్‌హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేసింది. మీ గడప వద్దకే వైద్యం నడిచి వస్తుందంటూ నమ్మించే ప్రయత్నం చేసింది. పీహెచ్‌సీల్లోనే అంతంత మాత్రం వైద్యులు, సిబ్బంది ఉండగా, దీనికి భిన్నంగా కొత్త క్లినిక్‌ల్లో అంతా సిద్ధం అన్నట్టు ఊదరగొట్టారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 938 విలేజ్ క్లినిక్‌లను మంజూరుచేశారు. వీటిల్లో ఏలూరు జిల్లాలో 534 క్లినిక్‌లను రికార్డుల్లో చూపించారు. ఇంతా చేస్తే ఈ క్లినిక్‌లు వచ్చి నాలుగేళ్లు కావొస్తోంది. కొన్ని క్లినిక్‌లకు సొంత భవనాలుండగా, మరికొన్ని అంతా ఏర్పాటు చేసినా సిబ్బందితో పాటు వైద్యులను నియమించపోవడంతో భూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో భవనాలు నిర్మించినా అవి గ్రామాలకు కిలో మీటర్ల మేర దూరంలో ఉండడం, వాటిని వినియోగించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మరికొన్ని అద్దె భవనాల్లో నామ మాత్రంగా కొనసాగుతున్నాయి. ఇప్పుడున్న రూరల్, పట్టణ హెల్త్ క్లినిక్‌లన్నీ నామకేవాస్తేగా నడుస్తున్నాయి. ప్రస్తుతం ఈ క్లినిక్‌లు షుగరు, బీపీ, సాధారణ వ్యాధులను పరీక్షించి ముందులు ఇచ్చేందుకే పరిమితమయ్యాయి. వీటి పర్యవేక్షణ ఆసాంతం లోపించింది. ఆరోగ్య శాఖ ఆ వైపు ఎక్కడా కన్నెత్తి చూడ లేదు. క్లినిక్‌ల నిర్వహణకు తదుపరి చర్యలంటూ ఏమీ లేవు. జిల్లావ్యాప్తంగా ఉన్న విలేజ్ క్లినిక్‌లను 'ఆంధ్రజ్యోతి' బృందం గురువారం విజిట్ చేసింది. ఆలాపాలనా కొరవడిన క్లినిక్‌లు కొన్నైతే.. భవనాలున్నా సిబ్బంది భరోసా లేక మరికొన్ని కనిపిస్తున్నాయి. ఆర్భాటంగా ప్రారంభించిన ఈ క్లినిక్ లేవి.. క్లిక్ కాలేదు.

- **దెందులూరు:** మండలంలో 17 హెల్త్ క్లినిక్‌లకు గాను చల్లచింతలపూడి, సీతంపేట, శ్రీరామవరంలో మాత్రమే నూతన భవనాలు కట్టి సిబ్బందిని నియమించారు. రూ.20 లక్షలతో సానిగూడెంలో హెల్త్ క్లినిక్ భవనం పూర్తయిన కరెంట్ తాగు నీరు తదితర సౌకర్యాలు కల్పించలేదు. మిగిలినచోట్ల పాత పంచాయతీ భవనాల్లో నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల జ్వరం, జలుబు మందులు లేవు. కొన్ని సెంటర్‌లలో వారం క్రితం మందులు వచ్చాయి.
- **లింగపాలెం :** మండలంలో 16 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుకు ఒక్కో భవన నిర్మాణానికి రూ.17.8 లక్షలను కేటాయించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాక నిర్మాణ పనులను వదిలి వేశారు. ఐదేళ్లలో ఒక్క భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేక పోయింది. ఐదు మినహా మిగిలినవి నిర్మాణ దశల్లోనే ఉండడంతో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు.



కొయ్యలగూడెం మండలం పరింపూడిలో అసంపూర్తిగా విలేజ్ క్లినిక్ భవనం

- **ద్వారకాతిరుమల :** మండలంలో ద్వారకాతిరుమల, సీహెచ్ పోతేపల్లి పీహెచ్‌సీల పరిధిలో 18 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. భవన నిర్మాణాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఒక్కో దానికి రూ.21 లక్షలు మంజూరయ్యాయి. ద్వారకాతిరుమల పీహెచ్‌సీ పరిధిలో 11 క్లినిక్‌ల్లో తిరుమలం పాలెం, గుణ్ణంపల్లి, గొల్లగూడెం, ఎం.నాగులపల్లిలో భవనాలు దాదాపు పూర్తయ్యాయి. తిమ్మా పురం, పి.కన్నాపురం లో పనులే ప్రారంభం కాలేదు. జాజులకుంట, ద్వారకాతిరుమల-2, పంగిడి గూడెం-1, 2, నారాయణపురంలో నిధుల కొరతతో అసంపూర్తిగా మిగిలాయి. సీహెచ్ పోతేపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఏడు వీహెచ్‌సీలు మంజూరు కాగా రామశింగవరం, దొరసానిపాడులలో భవనాలు పూర్తయ్యాయి. లక్ష్మీపురం, గుండు గొలనుకుంట, జి.కొత్తపల్లి, రామన్నగూడెం, రాళ్లకుంటల్లో పనులు ప్రారంభమే కాలేదు. ద్వారకాతిరుమల వసంత్‌నగర్ కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన వీహెచ్‌సీకి రూ.9 లక్షల వరకు ఖర్చు చేసి శ్లాబ్ పోశారు. అన్నిచోట్ల నిధుల కొరతతో పనులు నిలిచిపోయినట్టు అధికారులు చెబుతున్నారు.

పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించాలి



గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. భవనాల నిర్మాణం పూర్తి కాక వైద్య సుదపాయాలను పేదలు పొంద లేకపోతున్నారు. పేరూరులో రెండేళ్లుగా నిలిచిపోయిన హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. హెల్త్ క్లినిక్‌ల్లో వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి, అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలి.

- సోమా రామలక్ష్మి, మాజీ సర్పంచ్, పేరూరు, ముదినేపల్లి మండలం



నూజివీడు మండలం వెంకటాద్రిపురంలో పిల్లర్ల దశలోనే నిలిచిన విలేజ్ హెల్త్ క్లినిక్

- **ముదినేపల్లి :** మండలంలోని హెల్త్ క్లినిక్ సెంటర్లు గ్రామీణులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించ లేకపోతున్నాయి. బీపీ, షుగర్, సీజనల్ వ్యాధులకు రక్త నమూనాల సేకరణ మాత్రం జరుగుగుతోంది. వైద్య సిబ్బంది ఉన్నా క్లినిక్‌ల్లో సదుపాయాలు లేక వివిధ రకాల వ్యాధిగ్రస్తులను పీహెచ్‌సీలకు పంపిస్తున్నారు.



పిచ్చిమొక్కల మధ్య అసంపూర్తిగా ఉన్న డాంగే నగర్ అర్బన్ హెల్త్ క్లినిక్ భవనం

- **జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెం పట్టణానికి రెండు అర్బన్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా పేరంపేట రోడ్డులో అర్బన్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం మాత్రమే పూర్తయింది. రూ.80 లక్షలతో చేపట్టిన ఈ భవనాన్ని అప్పటి ఎమ్మెల్యే వి.ఆర్.ఎలీజా రెండేళ్ల క్రితం పనులు పూర్తి కాకుండానే ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక రెండు నెలల క్రితం మే 15న ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పునః ప్రారంభించారు. ప్రస్తుతం ప్రజలకు వైద్య సేవలందుతున్నాయని డాక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. డాంగే నగర్‌లో రూ.80 లక్షలతో చేపట్టిన అర్బన్ హెల్త్ క్లినిక్ పనులు రెండేళ్ల క్రితం నిధులు లేక నిలిచిపోయాయి. భవనం చుట్టూ పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. మిగిలిన కొద్దిపాటి పనులకు ప్రభుత్వం రూ.27 లక్షలు నిధులు కేటాయించగా టెండర్ ప్రక్రియ పూర్తయిందని, ఈ వారంలో పనులు చేపట్టి వచ్చే నెలాఖరులోగా ప్రారంభానికి సిద్ధం చేస్తామని మున్సిపల్ కమిషనర్ రమణ తెలిపారు.

మొత్తం 17 హెల్త్ క్లినిక్‌లకు ఆరు పూర్తి కాగా మిగిలినవి మధ్యలోనే నిలిచిపోయాయి.

- **నూజివీడు టౌన్ :** నూజివీడు మండల పరిధిలో దిగవల్లి, గొల్లపల్లి పీహెచ్‌సీలు ఉండగా 29 గ్రామాల్లో మొత్తం 24 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో కేవలం ఎనిమిది మాత్రమే నిర్మాణం పూర్తికాగా మిగిలిన 16 వివిధ దశల్లో నిలిచిపోయాయి. దిగవల్లి పీహెచ్‌సీ పరిధిలో 13 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మూడు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. గొల్లపల్లి పీహెచ్‌సీ పరిధిలో 11 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గాను తుక్కులూరు ఎంఎన్ పాలెం (మిగతా 8వ పేజీలో)



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్‌జీయూకేటీ రెండో విడత కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మిగిలిన జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను గురువారం నుంచి ప్రారంభించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ పర్యవేక్షణలో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించగా మొత్తం 803 సీట్లకు 803 మంది విద్యార్థులకు కాల్ లెటర్లను పంపించారు. వీరిలో 573 మంది కౌన్సెలింగ్‌కు హాజరుకాగా 557 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరిలో బాలురు 216 మంది, బాలికలు 341 మంది ఉన్నారు. ఏవో లక్ష్మణరావు, అకడమిక్ అసోసియేట్ డీన్‌లు చిరంజీవి, ప్రొఫెసర్ గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నిర్వహణలో భయాన్ని వీడాలి : ఎస్పీ



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నిర్వహణలో సిబ్బంది భయాన్ని విడనాడాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మానసిక వికాసం, లైఫ్ స్టైల్ స్కిల్స్, మహిళలు ఉద్యోగ నిర్వహణలో ఎదుర్కొంటున్న సవాళ్లు, ఒత్తిళ్లను అధిగమించడం అనే అంశంపై ఒక్క రోజు వర్క్‌షాపును నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుల పట్ల ప్రతి ఒక్కరు మర్యాదగా నడుచుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీస్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఫ్యాకల్టీ నిపుణులు సునీత రాకేష్ కొరపాటి వివిధ అంశాలను వివరించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ సీఐ హబీబ్‌పాషా, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు, ఎస్ఐ గంగాధరరావు, సైబర్ సెల్ మహిళా ఎస్ఐ వల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్.. మతలబు

- ఆశించిదొకరు.. దక్కింది మరొకరికి
- మంత్రి కోటలో బీజేపీకి మార్కెట్ కమిటీ
- కైకలూరు మార్కెట్‌లోనూ ఇదేతీరు
- పోలవరంలో టీడీపీదే పైచేయి
- చింతలపూడి, కలిదిండి పెండింగ్



కుంపటి అరుణ, నూజివీడు | పొట్టా రామారావు, పోలవరం | పెన్మత్స త్రినాథరాజు, కైకలూరు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు జిల్లాలోని మూడు మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అందరూ విస్తుపోయేలా చైర్మన్ల నియామకం జరగడం రాజకీయ వర్గాలను ఒకింత గందరగోళ పరిచింది. మంత్రి కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడులో ఏఎంసీ చైర్మన్ పదవి అనూహ్యంగా బీజేపీ వశమైంది. టీడీపీలోనే అత్యధికులు ఈ పదవిని ఆశిస్తూ మంత్రిపై తీవ్రస్థాయిలో ఒత్తిడికి ప్రయత్నించారు. దీనికి భిన్నంగా ఒక ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా వ్యవహరిస్తున్న బీజేపీ మహిళా నేత కుంపటి అరుణకు చైర్మన్ పదవి దక్కింది. ఈమె స్వగ్రామం గొల్లపల్లిలో సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆమె భర్త రంగారావు బీజేపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. మహిళా కోటా కింద నూజివీడును తమ పార్టీకి కేటాయించాలని పార్టీ సీనియర్ నేత తపనా చౌదరి, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ ఉన్నతస్థాయిలో చక్రం తిప్పారు. ఆమె నియామకంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీలో ఈ పరిణామం ఒకింత షాకిచ్చినట్లైంది.

జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న పోలవరం ఏఎంసీ చైర్మన్ పదవిని జనసేన, టీడీపీ ఆశించాయి. జనసేన పార్టీ పక్షాన పూనెం ఆదిత్య పేరును ప్రతిపాదించి అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కమిటీని ఓసీ కేటగిరి కింద రిజర్వేషన్ మార్పించేందుకు రెండు పార్టీల నేతలు విశ్వ ప్రయత్నాలు చేశారు. చివరకు ఎస్టీ రిజర్వుడ్‌కు కేటాయించిన చైర్మన్ పదవి టీడీపీకి చెందిన పొట్టా రామారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో నియోజకవర్గంలో టీడీపీదే ఈసారి పైచేయి అయ్యింది.

కైకలూరులోనూ ఈ తరహా సీన్ కొనసాగింది. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యేగా డాక్టర్ కామినేని శ్రీనివాస్ కొనసాగుతున్నారు. కైకలూరు మార్కెట్ కమిటీకి పూల రామచంద్రరావు పేరును ఎమ్మెల్యే పక్షాన ప్రతిపాదించారు. దీనికి విరుద్ధంగా పార్టీనే అంటిపెట్టుకుని ఉన్న పెన్మత్స త్రినాథరాజును చైర్మన్‌గా ఎంపిక చేశారు. పార్టీ మండల అధ్యక్షుడిగా ఆయన పలుమార్లు బాధ్యతలు నిర్వహించారు. మొత్తం మీద ఏలూరు జిల్లాలో పది మార్కెట్ యార్డులుండగా, చింతలపూడి, కలిదిండి మినహా మిగతా మార్కెట్లకు చైర్మన్‌లను నియమించినట్లైంది. కలిదిండి మార్కెట్ కమిటిని బీజేపీ ఆశిస్తోంది.

పశ్చిమలో ఇలా..

పశ్చిమ గోదావరి జిల్లాలోని మూడు ఏఎంసీల చైర్మన్ పదవులు తెలుగుదేశం పార్టీకే దక్కాయి. భీమవరం ఏఎంసీ చైర్మన్‌గా కలిదిండి రామచంద్రరాజు భార్య సుజాత, నరసాపురం ఏఎంసీ చైర్మన్‌గా జక్కం శ్రీమన్నారాయణ, పెనుగొండ ఏఎంసీ చైర్మన్‌గా బడేటి వీరబ్రహ్మంను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.



రప్పా రప్పా అంటే పెట్టుబడులు రావు..

'జగన్ పాలనలో రాష్ట్రానికి ఒక్క కంపెనీ రాలేదు. ఒక్క ఉద్యోగం లేదు. మేం వారం వారం కంపెనీలు, ఉద్యోగ అవకాశాలను తీసుకుని వస్తున్నాం. రప్పా రప్పా అంటూ జగన్ రెచ్చగొట్టే నినాదాలు చేస్తే పెట్టుబడులు రావు. పరిశీనలతో కూడిన పాలనకే పెట్టుబడులు వస్తాయి. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఏపీని టెక్నాలజీ, పెట్టుబడి, పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దబోతున్నాం' అంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ద్వారకా తిరుమలలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలిసి నిర్వహించారు. మెయిన్‌లో..

సాగు నీటికి కటకట!

- నారుమళ్లకు అందని నీరు
- ఎండిపోతున్న వెదజల్లిన వరి
- ఎటు చూసినా ఇంజన్ల సాగే

ముదినేపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సమస్య మరింత జఠిలమైంది. సార్వా సాగు సజావుగా సాగుతుందా.. లేదా.. అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వర్షాలు కురవక, పంట కాల్వల ద్వారా సరిపడినంత నీరందక అన్నదాత అగచాట్లు పడుతున్నాడు. ఒకపక్క నారుమళ్లు ఎండిపోతుండగా మరోపక్క పొలాలను దుక్కులు చేసుకునేందుకు నీరందని పరిస్థితుల్లో దిక్కులు చూస్తున్నారు. ముదినేపల్లి మండలంలో పోల్‌రాజ్ క్యాంప్‌బెల్, బీఎండీ, గుడివాడ ఛానల్ కింద ఆయకట్టులో వేలాది ఎకరాల ఆయకట్టులో వెదజల్లిన వరిపైరుకు నీరందని పరిస్థితి ఏర్పడింది. పోల్‌రాజ్ కెనాల్ కింద మరింత దుర్భిక్ష పరిస్థితి నెలకొంది. కనీసం నారుమళ్లను బతికించుకునేందుకైనా కొద్దిపాటి నీరు అందడం లేదు. ముదినేపల్లి, అన్నవరం, వడాలి, చినకామనపూడి, చిగురుకోట తదితర గ్రామాలలో కొంత ఆయకట్టులో వెదజల్లిన సార్వావరి పైరునీరందక ఎండిపోగా, వందలాది ఎకరాల విస్తీర్ణంలో ఎదుగుబొదుగూ లేకుండా ఉంది. చినకామనపూడి ఏరియాలోని రైతులు గరువు భూములను దున్ని సిద్ధం చేసుకున్నా నీరందుతుందో లేదోనన్న భయంతో విత్తనాలు వెదజల్లలేదు. సీబీ కెనాల్ కింద కోమర్రు, కాకరవాడ తదితర గ్రామాల్లో భూములను దుక్కులు చేసుకునేందుకు నీరందడం లేదు. గుడివాడ ఛానల్ కింద నీరందక శివారు ఉన్న చినపాలపర్రు, అత్తివాని చెరువు గ్రామాల ఏరియాల్లో నారు సిద్ధంగా వున్న నాట్లు వేసేందుకు నీరందడం లేదు. మండలంలో ఏ గ్రామంలో చూసినా మురుగు కాల్వలు, పంటకాల్వల్లో ఉన్న కొద్దిపాటి నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడుకోవాల్సిన పరిస్థితి. ప్రధాన పంటకాల్వలకు చాలీచాలని నీరు విడుదల చేయడంతో బ్రాంచి కాల్వలకు నీరు అందడం లేదు.



చినపాలపర్రు వద్ద ఇంజన్‌తో నీరు తోడుకుంటూ రైతులు నారుతీత



అన్నవరంలో నీరు లేక ఎండిపోయిన వరి విత్తనాలు వెదజల్లిన భూములు

నారుమళ్లకు నీరు లేదు



ముదినేపల్లి ఆయకట్టుకు సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కనీసం నారుమళ్లకు కూడా నీరు అందడం లేదు. నాట్లు ఎప్పటికి పూర్తవుతాయో అర్థం కావడం లేదు. బ్రాంచ్ కాల్వలకు అందేలా నీరు విడుదల చేయాలి.

- నిమ్మగడ్డ రవి, రైతు, ముదినేపల్లి



ద్వారకాతిరుమల ఆలయానికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

చినవెంకన్న సేవలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

ద్వారకాతిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి సమాచార ప్రసారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సందర్శించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలసి గురువారం సాయంత్రం ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవాలయం వద్ద అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రదక్షిణల అనంతరం బంగారువాకిలి నుంచి లోపలకి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం పొందారు. స్వామి, అమ్మవార్ల చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.

ఆషాఢంలోనూ అదిరిన శ్రీవారి హుండీ ఆదాయం

రూ.2.82 కోట్లు లభ్యం



ద్వారకాతిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆషాఢంలోనూ చిన్న తిరుమలేశునికి హుండీ ఆదాయం అదిరింది. హుండీల లెక్కింపు ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 30 రోజుల కాలానికి జరిగిన ఈ లెక్కింపులో శ్రీవారికి నగదు రూపేణా రూ.2.82 కోట్లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణమండప ఆవరణలో గురువారం అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. 2,82,31,619 రూపాయల నగదుతో పాటు 202 గ్రాముల బంగారం, 5.546 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (15), 1000(12) 2000(14)తో పాటు విదేశీ కరెన్సీ లభించింది.

మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.88.69 లక్షలు



భీమవరం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ హుండీ ఆదాయం గురువారం లెక్కించగా 88 లక్షల 69 వేల 425 రూపాయలు వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్ తెలిపారు. నగదుతో పాటు 92.500 గ్రాముల బంగారం, 623 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ భక్తులు సమర్పించుకున్నారన్నారు. దేవదాయ ధర్మదాయశాఖ అధికారి హరి సూర్యప్రకాశ్ పర్యవేక్షించారని తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయ ఈవో దండు కృష్ణంరాజు, బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు..

కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి వర్మ



అక్కడి అర్చకులతో మంత్రి వర్మ

భీమవరం టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ గురువారం వారణాశిలో పర్యటించారు. వారణాశికి క్షేత్రపాలకుడిగా ప్రసిద్ధ చెందిన కాలభైరవ స్వామి ఆల యాన్ని సందర్శించి పత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చేరుకొని విశ్వనాథుడిని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు ఆయన నిర్వహించారు వర్మ మాట్లాడుతూ కాశీ విశ్వనాథుడి దర్శనం ఎంతో ఆనందాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కలిదిండి వినోద్ వర్మ, వేగేశ్న రంగరాజు, వేగేశ్న పవన్ వర్మ, వేలూరి రామయ్య శర్మ ఉన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడు ?

ఇంటర్ ఫలితాలు వచ్చి మూడు నెలలు

ఇప్పటికీ నోటిఫికేషన్ విడుదల చేయని విద్యాశాఖ

ఇతర డిగ్రీలవైపు విద్యార్థులు.. ఆందోళనలో యాజమాన్యాలు

రీయింబర్స్‌మెంట్ సహా పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

లేకుంటే ఈ నెల 21న డిగ్రీ కళాశాలల బంద్‌కు పిలుపు



ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు వెల్లడించి మూడు నెలలు గడుస్తున్నప్పటికీ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మొదలు కాకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. ప్రవేశాలు ఎప్పుడు కల్పిస్తారంటూ ఇటు విద్యార్థులు, అటు ప్రైవేటు కాలేజీల యాజ మాన్యాలు ఎదురుచూస్తున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికా రులకు ఏపీ ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజ మాన్యాల అసోసియేషన్ విన్న వించింది. అడ్మిషన్లతో పాటు పెండింగ్‌లో వున్న సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 21న డిగ్రీ కళాశాలలు బంద్ చేస్తామని పిలుపునిచ్చాయి.

– తణుకు, (ఆంధ్రజ్యోతి)

గందరగోళానికి ప్రధాన కారణం

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం కొనసాగించాలా ? డబుల్ మేజర్ విధానం ప్రవేశపెట్టాలా ?అనే గందరగోళం నెలకొనడమే అడ్మిషన్ల జాప్యానికి ఓ కారణం. ఇప్పటి వరకు సింగిల్ మేజర్ విధానం నడుస్తోంది. ఈ ఏడాది నుంచి డబుల్ మేజర్ విధానం ప్రవేశపెడతామని ప్రతి కళాశాల ఇందుకు అప్‌గ్రేడ్ చేయించుకోవాలని సూచించారు. ఆ మేరకు యాజమాన్యాలు నగదు చెల్లించి అనుమతి తీసుకున్నారు. విద్యార్థులకు డబుల్ మేజర్‌పై అవగాహన కల్పించారు. చాలా మంది తల్లిదండ్రులు దీనివైపు మొగ్గు చూపించారు. కాని, ప్రభుత్వం చివరకు సింగిల్ మేజర్ వైపు మొగ్గు చూపుతూ నిర్ణయం తీసుకుంది.మరోవైపు ఇంతకుముందు ఆఫ్‌లైనన్‌లోనే డిగ్రీ ప్రవేశాలకు అడ్మిషన్లు జరిగేవి.. వైసీపీ వచ్చాక ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టింది..ఈ ఏడాది నుంచి ఆఫ్‌లైన్‌లో ప్రవేశాలు కల్పించే అవకాశం ఉందని కళాశాలల యాజ మాన్యాలు చెబుతున్నాయి. దీనిపై కూడా అయోమయం నెలకొంది..

లక్షల మంది విద్యార్థులపై ప్రభావం

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 256 ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో అడ్మిషన్ల కోసం లక్షల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. అడ్మిషన్లు తీసుకోవాలంటే కళాశాలలు గుర్తింపు కోసం దరఖాస్తులు చేసుకోవాలి. అడ్మిషన్ల ప్రక్రియ గందర గోళంలో ఉండడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు ఎవరూ దరఖాస్తు చేయలేదు. దరఖాస్తు చేయాలి, ప్రభుత్వం నుంచి కమిటీ వచ్చి కాలేజీలో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా పరిశీలించి గుర్తింపును పునరుద్ధరిస్తారు. ఇప్పటి వరకు ఇలాంటి ప్రక్రియ మొదలు కాలేదు.

అడ్మిషన్లపై ప్రభావం

ప్రభుత్వ నిర్ణయం ఆలస్యం కారణంగా ఇప్పటికే డిగ్రీలో చేరాలనుకునే వేలాది విద్యార్థులు ఇంజనీరింగ్ ఇతర కోర్సుల వైపు మళ్లిపోతున్నారని యాజమాన్యాలు చెబుతున్నాయి. గత ఏడాది అడ్మిషన్లు 2.50 లక్షల నుంచి లక్షకు పడిపోయాయి. ఇప్పటి పరిస్థితుల నేపథ్యంలో ఇది మరింత తగ్గిపోయే ప్రమాదం ఉంది.

విడుదల కాని బకాయిలు

ప్రభుత్వం కళాశాలలకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికి విడుదల చేయడం లేదు. దీంతో కాలేజీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. బకాయిలను విడతల వారీగా విడుదల చేస్తామని చెప్పినప్పటికి ఇప్పటి వరకు విడుదల చేయలేదు. 2023-24కు మూడు క్వార్టర్లు, 2024-25కు మూడు క్వార్టర్‌లకు బకాయిలు విడుదల చేయాలి. దీనిపైన ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు.

సింగిల్, డబుల్ మేజర్ విధానం అంటే..

డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం అంటే విద్యార్థి ఒకే ఒక్క ప్రధాన సబ్జెక్టును మేజర్‌గా తీసుకుని, మిగిలిన సబ్జెక్టులను మైనర్‌గా గాని, సపోర్టివ్‌గా గాని చదవాలి. ఉదాహరణకు బీఎస్సీ (ఫిజిక్స్) అంటే.. ఫిజిక్స్ ప్రధాన మేజర్ సబ్జెక్టు. మిగిలిన సబ్జెక్టులు కెమెస్ట్రీ, మేథ్స్ వంటివి సపోర్టివ్‌గా వుంటాయి.

డబుల్ మేజర్ అంటే డిగ్రీలో రెండు ప్రధాన సబ్జెక్టులను మేజర్‌గా తీసుకుని చదవాలి. ఉదాహరణకు బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్) ఇక్కడ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ రెండూ మేజర్ సబ్జెక్టులు. రెండింటిని సమాన ప్రాముఖ్యతతో చదివి, రెండింటిపైనా లోతుగా అవగాహన పెంచుకుంటారు.

సమ్మె తప్పదా ?

విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. 'డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలి. డబుల్ మేజర్ విధానం అమలు చేయాలి. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి. కొత్త కోర్సులకు అనుమతితో పాటు పాత కోర్సుల మార్పునకు అనుమతి ఇవ్వాలి. ఐదేళ్లపాటు అనుబంధ అనుమతులు మంజూరు చేయాలి. ప్రవేశాల్లో 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. వీటిని పరిష్కరించని పక్షంలో ఈ నెల 21 'కాలేజీల బంద్' చేస్తామని స్పష్టం చేశారు.

• సమస్యలు పరిష్కరించాలి



డిగ్రీ అడ్మిషన్లలో వున్న గందరగోళానికి ప్రభుత్వం తెరదించాలి. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. అడ్మిషన్ల కోసం షెడ్యూల్ విడుదల చేయాలి. అధికారులు చర్యలు వేగవంతం చేయాలి. లేని పక్షంలో ముందుగా నిర్ణయించిన మేరకు నిరసన బంద్ చేయడానికి అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది.

మహమ్మద్ అబీబ్, ఏపీ ప్రైవేటు డిగ్రీ, కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తూర్పు, పశ్చిమ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు

• కళాశాలలపై ప్రభావం



ప్రస్తుతం అడ్మిషన్లలు గందరగోళంలో డిగ్రీ కాలేజీపై ప్రభావం చూపుతున్నాయి. కాలేజీలు మనుగడ ప్రశ్నార్థంగా మారే అవకాశాలు వున్నాయి. డబుల్ మేజర్‌ను అమలు చేయాలి. ఇప్పటికే మిగిలిన చోట్ల ప్రవేశాలు పూర్తయి విద్యా ప్రణాళిక ప్రారంభమైంది. వెంటనే చర్యలు తీసుకోవాలి.

గోపిశెట్టి రామకృష్ణ, ప్రగతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, తణుకు

మొగల్తూరు స్కూల్‌లో వేగంగా నిర్మాణ పనులు

ఉప ముఖ్యమంత్రి పవన్ చొరవతో నిధులు మంజూరు చేసిన లోకేశ్



మొగల్తూరు హైస్కూల్‌లో అదనపు తరగతి గదులకు జరుగుతున్న నిర్మాణ పనులు

మొగల్తూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు పంచాయతీ అభివృద్ధిపై దృష్టిపెట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆ దిశగా గ్రామాభివృద్ధి పనులకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. గ్రామంలో తన పేషీ నుంచి పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజను ఈ ఏడాది మార్చి 28న నేరుగా మొగల్తూరు పంపి రచ్చబండ నిర్వహించి గ్రామ సమస్యలు తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి తొలి ప్రాధాన్యతగా ఆయన కుటుంబ సభ్యులు చదివిన మొగల్తూరులోని పెన్మత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి స్కూల్ అభివృద్ధికి చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించడంతో లోకేష్ మొగల్తూరు ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.1 కోటి 71 లక్షలు నిధులు మంజూరుకు ఈ ఏడాది మార్చి 29న ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలకనుగుణంగా పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ.31.06 లక్షలు, భోజన శాలకు రూ.26 లక్షలు, ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేయడానికి రూ.30 లక్షలు, క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ.59.5 లక్షలు పాఠశాల ప్రహరీగోడ అభివృద్ధికి రూ.10 లక్షలు, సైకిల్ స్టాండ్ నిర్మాణానికి రూ.10 లక్షలు, అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీనిలో భాగంగా తొలివిడతగా పాఠశాల విద్యార్థులకు అవసరమయ్యే నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు కావడంతో గదుల నిర్మాణం పనులు చేపట్టారు. అలాగే మరో 18 లక్షల నిధుల మంజూరుకు తగు ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపారు. పాఠశాలలో అభివృద్ది పనులు వేగంగా జరుగుతుండటంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు అభినందిస్తున్నారు. వచ్చే వర్షాలు నాటికి పాఠశాల గ్రౌండ్ లెవెల్ అభివృద్ధి పనులు కూడా వేగవంతంగా చేపడితే వర్షాకాలంలో పాఠశాల క్యాంపస్ ముంపు ప్రభావం ఉండదని అభిప్రాయ పడుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్.. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

సాంకేతిక సాయంతో నేరాల అదుపు

పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా

గంజాయి అక్రమ రవాణా అరికట్టడానికి ప్రత్యేక చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

భీమవరం క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నమోదైన దొంగతనాలు, దోపిడీకి, ఆస్తి నేరాలు, హత్యాయత్నం, చీటింగ్ వంటి కేసులపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. భీమవరం విష్ణు కళాశాల సమావేశ మందిరంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, వైద్య, విద్య, న్యాయ, ఇతర శాఖల ఉన్నతాధికారుల సమక్షంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఐజీ అశోక్ కుమార్ హాజరయ్యారు. ఐజీ మాట్లాడుతూ 2025వ సంవత్సరానికి సంబంధించి జనవరి నుంచి జూన్ వరకు జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు.రోడ్డు ప్రమాదాలు, డ్రంకెన్ డ్రైవ్, మోటార్ వెహికల్ యాక్ట్, జూదాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. కేసులు దర్యాప్తు సమయంలో వైద్య శాఖ జారీ చేయు వివిధ ధృవపత్రాలకు సంబంధించిన అంశాలు, సముద్ర తీరం, నదీపరివాహక ప్రాంతాల్లో సంభవిస్తున్న మరణాలు, నివారణా చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటుకు పోలీసు శాఖ కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలను జిల్లా పోలీసు శాఖకు అందించడం జరుగుతుందని ఆయా శాఖల ఉన్నతాధికారులు తెలియజేశారు. అఫెండర్ సర్వే లైట్స్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించుకుని జిల్లాలోని పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆధ్వర్యంలో పోలీసు శాఖ సమర్థవంతమైన సేవలను అందిస్తుందని అన్నారు. క్రైమ్ డిటెక్షన్‌లో రాష్ట్ర స్థాయిలో పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు శాఖ ప్రథమ బహుమతిని అందుకోవడం గర్వకారణమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌తో జిల్లాలో నేరాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్ (పీ4) కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు రెవెన్యూ, ఎక్సయిజ్, రవాణా, విద్య, వైద్య, న్యాయ ఇతర శాఖల జిల్లా ఉన్నతాధికారులను సమన్వయపరచుకుంటూ పని చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ నాగరాణిని, ఐజీ అశోక్ కుమార్‌ను సత్కరించారు. అదనపు ఎస్పీ భీమారావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమరేశ్వరన్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి, డిస్ట్రిక్ట్ రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు, ఎఫ్ఎస్ఎల్ అడిషనల్ డైరెక్టర్ ఫణిభూషణ్, డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నారాయణ పాల్గొన్నారు.

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని..

పెదవాగు ఊళ్లపై విరుచుకుపడింది.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఊరంతా కట్టుబట్టలతో బయటపడ్డారు.. ఇళ్లన్నీ మునిగి పోయాయి. సామాగ్రి వరదనీటిలో కొట్టుకుపోయాయి.. పంట చేలన్నీ ధ్వంసమయ్యాయి.. సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజున జరిగిన ఈ భయానక ఘటనను వేలేరుపాడు మండలంలోని 10 గ్రామాల ప్రజలు నేటికి మరచిపోలేకపోతున్నారు.. ఆ రోజు జరిగిన విధ్వంసాన్ని తలుచుకుని ఉలిక్కిపడుతున్నారు.

విరుచుకుపడిన పెదవాగు

ఊళ్ల మీదకు వరదనీరు

కట్టుబట్టలతో ఇళ్లు వదలి పరుగులు తీసిన గిరిజనులు

పెదవాగు విధ్వంసానికి ఏడాది



వరద ఉధృతికి కూలిన ఇళ్లు (ఫైల్ ఫొటో)

వేలేరుపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): 2024 జూలై 18న కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లి వరద నీరంతా తెలంగాణలోని అశ్వారావుపేట పెద వాగు ప్రాజెక్టుకు చేరుకుంది. ఆ రోజు 29 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవడంతో వరదనీరు ఏరులై పారింది. ఆరుమీటర్ల నిల్వ సామర్థ్యం కలిగిన పెదవాగు ప్రాజెక్టుకు భారీస్థాయిలో వరద చేరుకోవడంతో ప్రాజెక్టుపై ఉన్న మూడు గేట్లను పూర్తిగా ఎత్తివేసి నీటిని దిగువకు వదిలారు. దీంతో వరద ఒక్కసారిగా పెదవాగు కట్టలను తెంచుకుని గ్రామాలపై విరుచుకుపడింది. అనుకోని విధంగా వరద వచ్చిపడటంతో ప్రాజెక్టు దిగువన ఉన్న కమ్మరిగూడెం, మేడేపల్లి, వంటిబండ, అల్లూరినగర్, మాదారం, రామవరం, ఊటగుంపు, రాళ్లపూడి, గొల్లగూడెం, వసంతవాడ, పూచిరాల, గ్రామాలకు చెందిన ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు పెట్టారు. రాజమండ్రి నుంచి రుద్రమ్మకోట గ్రామానికి కారులో వస్తున్న ఐదుగురు వ్యక్తులు కారుతో సహా మాదారం సమీపంలోని కొడిసల కాల్వ దగ్గర వచ్చేసరికి ఒక్కసారిగా వచ్చిపడిన వరదతో కారుతో పాటు అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు కొట్టుకు పోయారు. ఈ కారులో డ్రైవర్, మరో ఇద్దరు మహిళలు, మరో ఇద్దరు చిన్నారులు ఉండగా కారు రహదారిపై నుంచి సమీపంలోని పెదవాగు సమీపం వరకు కొట్టుకుపోయి అక్కడ ఒక వెదురు పొదలు అడ్డుపడటంతో అక్కడ చిక్కుకుపోయారు. మాదారం గ్రామప్రజలు ప్రాజెక్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వీరిని రక్షించడానికి ప్రాజెక్టులో ఒక గేటును కిందకు దించారు. వరద కొంత తగ్గుముఖం పట్టడంతో మాదారం, అల్లూరినగర్ గ్రామప్రజలు, యువకులు కారులో చిక్కుకున్న వారిని అతికష్టంతో ప్రాణాలతో కాపాడారు. తిరిగి ప్రాజెక్టు గేటును తెరిచే ప్రయత్నం చేయగా అది మొరాయించింది. దీంతో అంతకంతకు ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగిపోవడంతో కట్టమీద నుంచి వరద పొంగిపోర్లింది. దీంతో ఒత్తిడి అధికమవడంతో ప్రాజెక్టు గేటు ఎడమవైపున భారీ గండిపడటంతో వరద ఉగ్రరూపంతో మరోసారి గ్రామాలపై విరుచుకు పడింది. దీంతో గ్రామంలోని ఇళ్లు అనేక నేలమట్టం అయ్యాయి. మిగిలిన ఇళ్లలోని సామాగ్రి వరదనీటిలో తడిచి పోయి భారీ నష్టం సంబవించింది. మేడేపల్లి నుంచి రాళ్లపూడి వరకు ఆర్అండ్‌బీ రహదారి మొత్తం కొట్టుకుపోగా రోడ్లపై పెద్దపెద్ద గండ్లుపడ్డాయి.



భారీ వరదకు తెగిపోయిన పెదవాగు ప్రాజెక్టు కట్ట (ఫైల్)

ఎడారుల్లా పంట చేలు..

పెదవాగు ఉధృతికి వందలాది ఎకరాల్లో భారీ ఎత్తున ఇసుక మేటలు పేరుకుపోయాయి. కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి జీవించే పెదవాగు పరివాహక ప్రాంత ప్రజలు భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోవడంతో భారీ ఎత్తున నష్టపోయారు. సర్వస్వం కోల్పోయిన తమకు ప్రభుత్వం కేవలం రూ.2 వేలు ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులు ఇచ్చి చేతులు దులుపుకుందని ఇసుక మేటలను ప్రభుత్వమే తొలగిస్తుందని జిల్లా కలెక్టర్ హామి ఇచ్చినా ఇంత వరకు పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. వరదకు కూలిపోయిన ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ఇంత వరకు అమలు చేయకపోవడంతో పూరిగుడిసెల్లోనే ఉంటున్నామని అల్లూరి నగర్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పెదవాగు ప్రాజెక్టు తెగిపోయి తమ బతుకులు బుగ్గిపాలయ్యాయని ప్రభుత్వం కూడా పట్టించుకోక పోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• ప్రభుత్వం నుంచి సాయం లేదు



పెదవాగు వరదకు ఇళ్లు పూర్తిగా నేలమట్టమై ఇంట్లో సామాను మొత్తం వరదకు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం పక్కా ఇళ్లు కట్టిస్తామని నేటి వరకు కట్టించలేదు. దాతలు ఇచ్చిన బరకాలతో పూరి గుడిసెవేసుకుని అందులోనే నివాసం ఉంటున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదు.

-కూసం తమ్మయ్య, అల్లూరి నగర్

• పొలాల్లో ఇసుక మేటలు



పెదవాగు వరదల కారణంగా నాకున్న నాలుగు ఎకరాల మాగాని పొలంలో ఇసుకమేటలు వేశాయి. వరదలకు ఇళ్లు కొట్టుకు పోయి పూర్తిగా నష్టపోయిన మేము పొలాల్లో పేరుకు పోయిన ఇసుకను తొలగించుకోవాలంటే అధిక మొత్తంలో ఖర్చవుతుంది. అంత ఖర్చును భరించే స్తోమత మాకులేదు. ప్రభుత్వం ఇసుక మేటలు తొలగిస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఆ పని చేయలేదు. దీంతో వ్యవసాయం చేసుకునే వీలులేక కూలి పనులకు వెళ్తూ జీవిస్తున్నాం.

- కుంజా మారయ్య, అల్లూరి నగర్

చట్టాలపై మరింత అవగాహన పెంచుకోవాలి

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్యానల్ న్యాయవాదులు చట్టాలపై మరింత అవగాహన పెంచుకుని కక్షిదారులకు నాణ్యమైన న్యాయ సహాయం అందించాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్యానల్ న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా వాదించే కేసులలోని న్యాయవాదులకు వారి విధులు మరింత నైపుణ్యం పెంచుకొనేందుకు ఈ అవగాహన సదస్సు నిర్వహించామని తెలిపారు. మారుతున్న చట్టాలు ఎప్పటికప్పుడు వివిధ కోర్టులు ఇచ్చే తీర్పులపైన వాటి ద్వారా అనుసరించాల్సిన విధి విధానాలు పైన న్యాయవాదులకు అవగాహన కలిగించామన్నారు. ఉచితంగా వాదించే కేసులను త్వరితగతిన పూర్తి చెయ్యాలని, ఎటు వంటి అలసత్వాన్ని వహించకుండా కక్షిదారులకు న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉద్దేశ్యమని ప్యానల్ న్యాయవాదులు చట్టాలపైన అవగాహన పొంది కక్షిదారులకు నాణ్యమైన న్యాయ సహాయం అందించాలని సూచించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పివిఎస్ మునీశ్వరరావు, ప్యానల్ లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్క జ్ఞాపకార్థం బిర్యాని పంపిణీ



తన ఇంటిలో 13 ఏళ్ల పాటు పిల్లలతో కలిసి పెరిగిన సీజర్ (పెంపుడు కుక్క) మరణించి ఎనిమిదేళ్లు అయినా దానిపై అభిమానం పోలేదు. అది మరణించిన జూలై 17వ తేదీన పాలకొల్లు పట్టణంలోని 50 కుక్కలకు యజమాని బిర్యాని పంపిణీ చేశారు. పేదవారికి బిర్యాని అందించి సీజర్‌ను గుర్తు చేసుకున్నారు.

- పాలకొల్లు అర్బన్ (ఆంధ్రజ్యోతి)

నేడు ఏలూరు కలెక్టరేట్ వద్ద సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసన

ఏలూరు అర్బన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పాత పెన్షన్ విధానం కోసం ఈనెల 18న కలెక్టరేట్ వద్ద డీఎస్సీ- 2003 టీచర్స్ పోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీటీఎఫ్-1938, నేషనల్ టీచర్స్ అసోసియేషన్, యూటీఎఫ్ జిల్లా నాయకులు జీ.కృష్ణ, రామోహనరావు, మోహన్‌రావు, సీహెచ్ రమణారావు, మురళి, ముస్తఫాఅలీ, రవికుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కేంద్రప్రభుత్వ మెమో 57 ఉత్తర్వుల ఆధారంగా డీఎస్సీ-2003 టీచర్లకు, 2004వ సంవత్సరం సెప్టెంబరు 1వతేదీ కంటే ముందు నోటిఫికేషన్ విడుదలై సీపీఎస్ పరిధిలో వున్న గ్రూప్-2 ఉద్యోగులు, కానిస్టేబుళ్లకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాల్సి ఉంటుందన్నారు. నిరసన కార్యక్రమానికి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రగోపిమూర్తి హాజరవుతారని వివరించారు. ఉమ్మడి జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

స్పిల్‌వే నుంచి 1,15,362 క్యూసెక్కులు విడుదల



పోలవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పోలవరంలో గోదావరి నీటిమట్టం గురువారం నాటికి పూర్తిగా తగ్గింది. దీంతో కవమ్స్ స్లూయిజ్ గేట్లు వరద నీటి నుంచి బయటపడ్డాయి. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే నుంచి 1,15,362 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్వే ఎగువన 27.250 మీటర్లు, దిగువన 17.340 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కులు

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఈఈ ఏసుబాబు తెలిపారు.గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉండడం వలన కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాలకు ఖరీఫ్ సీజను అవసరాల రీత్యా 22 పంపుల ద్వారా నీరు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.



మార్టేరు ఉన్నత పాఠశాలలో పరిశీలన చేస్తున్న బృందం

గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన

పోడూరు/ పెనుమంట్ర, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కేంద్ర బృందం సభ్యులు గురువారం మండలంలోని కవిటం, పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామాల్లో పర్యటించారు. కవిటంలో అన్ని వీధుల్లోనూ పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పనులను, పాఠశాలల టాయిలెట్స్ నిర్వహణను, వైద్య ఆరోగ్య ఉప కేంద్రం పనితీరును పరిశీలించారు. అంగనవాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రతను పరిశీలించారు.ప్రజలకు సరఫరా చేస్తున్న రక్షిత మంచినీటి సరఫరాను, క్లోరినేషన్ చర్యలు,డ్రైనేజీలను పరిశీలించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ప్రజలకు అందిస్తున్న పథకాల వివిధాలు అమలవుతున్నాయని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులను, వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సెంట్రల్ టీమ్ లీడర్లు ఎం.మధుమతి, జీనాగ రవికిరణ్, జిల్లా కన్సల్టెన్సీ ఎం.సంతోష్‌కుమార్, సర్పంచ్ సీహెచ్‌పూర్ణిమ, ఎంపీడీవో వి.మంగాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరెడ్డి, కార్యదర్శి కెళ్ళపుష్పవేణి కూటమి నాయకులు పాల్గొన్నారు. మార్టేరులో పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, బసంతి దేవి ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు,చెత్తసంపద కేంద్రాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డుల్ని, అంగన్వాడీ, ఆసుపత్రుల్లో నిర్వహణ రిజిస్టర్లు తనిఖీ చేశారు. గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో రాంబాబు, గ్రామ సచివాలయ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్సీ బొత్స

కాళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావులు వైసీపీ శ్రేణులకు సూచించారు. కాళ్ళ మండలం పెద అమిరంలో ఉండి నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. వైసీపీ ఉండి ఇన్‌ఛార్జి పీవీఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు తదితరులు హాజరై మాట్లాడారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన ప్రతి కార్యకర్తను ఉన్నత స్థానంలో నిలుపుతామన్నారు. ఎమ్మెల్సీ కొయ్యే శ్రీనివాస్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, గూడూరి ఉమాబాల, ముదునూరి మురళీ కృష్ణంరాజు, చినమిల్లి వెంకటరాయుడు, పాతపాటి శ్రీనివాసరాజు, మేడిది జాన్సన్, పెండ్ర వీరన్న, వైసీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఆర్ట్ పోటీల్లో వెంపటాపునకు నగదు పురస్కారం

తణుకు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తణుకుకి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటీషన్‌లో రూపాది వేల నగదు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ సామల లక్ష్మయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో వెంపటాపు 'ఇవ్ ఎ చెటో టు బి బోర్న్ కుమారా' శీర్షికతో వేసిన చిత్రానికి బహుమతి గెలుచుకున్నారు. ఈనెల 14,15,16 తేదీలలో నెహ్రూ ఆర్ట్ గేలరీ హైదరాబాద్‌లో జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో పురస్కారంతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



అవార్డు పొందిన పెయింటింగ్



బహుమతి అందుకుంటున్న వెంపటాపు

మిస్సింగ్ మిస్టరీ ?



మహిళలు, బాలికల అదృశ్యాల ఘటనలు పెరిగిపోతున్నాయి. వీటిపై రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇంట్లోవారి వేదన తట్టుకోలేక, మరికొందరు ప్రేమ పేరుతో, ఇంకొందరు విదేశాల్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ వెళ్లి అదృశ్యమవడం.. ఇవిధంగా రకరకాల కారణాలతో మహిళలు, బాలికలు అదృశ్యమవుతున్నారు. పోలీసులు ఎన్నో రకాలుగా ప్రయత్నించి వారి జాడను గుర్తించి తీసుకొస్తున్నప్పటికీ ఇంకా చాలామంది ఆచూకీ లభ్యంకాకపోవడం మిస్టరీగానే మారింది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

అతివల అదృశ్యం.. కానరాని జాడ

- స్వచ్ఛందంగా వెళ్లిపోతున్న కొందరు
- మాయమాటలతో మరికొందరు..
- ఏడాదిన్నరగా 46 మంది జాడ ఎక్కడ ?

భీమవరం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : మహిళల అదృశ్యమవడానికి గల నిర్దిష్ట కారణాలు ఎవరికీ తెలియని ప్రశ్నగానే మారింది. ముఖ్యంగా తల్లిదండ్రుల పెంపకం ప్రభావంతో కొంతమంది మహిళలు ఇళ్లల్లోనుంచి వెళ్లిపోతున్నారు. మరికొందరైతే ఉద్యోగాల పేరిట విదేశాలకు వెళ్లి అక్కడ చిక్కుకుని జాడ లేకుండాపోతున్నారు. కొందరిని దుండగులు ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు విక్రయాలు చేయడంతో వారి జాడ కూడా తెలియకుండాపోతుంది. ఈ విధంగా పశ్చిమ గోదావరి జిల్లాలో జనవరి 2024 నుంచి ఇప్పటివరకు 368 మంది మహిళలు అదృశ్యం కాగా, 168 మంది బాలికలు అదృశ్యమయ్యారు. వారిలో 329 మంది మహిళల ఆచూకీ లభ్యం కాగా, 39 మంది మహిళల ఆచూకీ లభ్యం కాలేదు. అలాగే 161 మంది బాలికల ఆచూకీ లభ్యంకాగా, ఇంకా ఏడుగురి ఆచూకీ లభ్యం కాలేదు.

ప్రేమ పేరుతో వ్యామోహం..

చాలామంది బాలికలు, మైనర్లు, మేజర్లు చదువుకుంటున్నప్పటి నుంచి పాఠశాలల్లో, కళాశాలల్లో ఎవరో ఒకరిపై వ్యామోహం పెంచుకుని, దానినే ప్రేమగా ఊహించుకుంటున్నారు. అవతలి వ్యక్తి చెప్పిన మాటలను నమ్మి చిన్న వయస్సులోనే ఇంట్లో వారికి చెప్పకుండా అవతలి వారితో వెళ్లిపోతున్నారు. తీరా కొంతకాలం ఆతడి వ్యామోహం తీర్చుకున్నాక వదిలిపెట్టేస్తున్నారు. ఈ మేరకు వారి జీవితాలు నరకప్రాయమవుతున్నాయి. ఇంటికి వెళ్లాలో.. ఏమి చేయాలో తెలియక సందిగ్ధంలో కొంతమంది మహిళలు, బాలికలు ఆత్మహత్యకు పాల్పడితే మరికొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఏదో ఒక ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొందరైతే యదావిధిగా తల్లిదండ్రుల వద్దకు చేరుతున్నారు. ఎన్నో రకాలుగా ప్రభుత్వం, పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ చాలామందిలో మార్పు రావడం లేదు. ఇటీవల కాలంలో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారని, వారిని కష్టపడకుండా చూసుకోవాలన్న ఆశతో కొంతమంది వలలో పడుతున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు ఉన్నాయని, మంచి జీతం వస్తుందని చెబుతూ ఉండటంతో వారి ఉచ్చులో పడి విదేశాలకు వెళ్తున్నారు. తీరా అక్కడకు వెళ్లాక తీసుకెళ్లినవారు మోసం చేయడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరినైతే వ్యభిచార ఉచ్చులోకి లాగుతున్నారు. ఇలా చాలామంది మహిళల జీవితాలు అగమ్యగోచరంగా మారుతుంది.

మహిళల పట్ల చిన్నచూపు

చాలాచోట్ల మహిళల పట్ల చిన్నచూపు కనబడుతుంది. పలు కంపెనీల్లో పనిచేసే మహిళల పట్ల అక్కడున్న యాజమాన్యం, తోటి ఉద్యోగులు చిన్నచూపు చూడటంతో వారు ఆందోళనలో ఉంటున్నారు. కొందరైతే మనస్తాపానికి గురైన సందర్భాలు ఉన్నాయి. పెద్దపెద్ద కంపెనీలలో మహిళలకు ప్రాధాన్యత లేదనేది జగమెరిగిన సత్యం. చాలా ప్రకటనల్లో 'మహిళలకు పెద్దపీట వేశాం.. వారిని ముందుకు నడిపిస్తున్నాం.' అనే నినాదాలు తప్ప వారిపై ఎటువంటి శ్రద్ధ చూపడం లేదనేది వాస్తవం. దీనివల్ల మహిళలు పురుషుల పట్ల చిన్నచూపునకు గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నకిలీ వెబ్‌సైట్లతో మోసపోవద్దు



చాలామంది మహిళలు, బాలికలు నకిలీ వెబ్‌సైట్లకు బానిసలవుతున్నారు. వాటిని క్లిక్ చేసి ఉద్యోగాల పేరిట వచ్చే వెబ్‌సైట్లతో మోసపోతున్నారు. విదేశాలకు వెళ్లి అక్కడ ఏదైనా ఉద్యోగాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రేమ వ్యామోహం, ఉద్యోగాల పేరిట నష్టపోతున్నారు. మహిళలు, బాలికలు ఎటువంటి ఇబ్బందులున్నా తల్లిదండ్రులు ఇంట్లో పెద్దవారికి చెప్పి వాటిని సరిదిద్దుకోవాలి తప్ప అనవసరమైన వాటికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోకూడదు. ఎవరైనా ప్రేమ అనే పేరుతో నమ్మించి మోసం చేస్తుంటారు. వారి విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

- ఆర్‌జీ జయసూర్య, భీమవరం డీఎస్పీ

పోలీసులపై చర్యలు తీసుకోవాలి / బుట్టాయగూడెం సీహెచ్‌సీ ఎదుట గిరిజనుల ఆందోళన

బుట్టాయగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): విచారణ పేరుతో గిరిజనుడిని స్టేషన్‌కు తీసుకువచ్చి దౌర్జన్యం చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేశారు. వీరన్నపాలెం గ్రామానికి చెందిన గుజ్జు లక్ష్మయ్య అనే గిరిజనుడిని విచారణ పేరుతో బుధవారం పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి 'నీ కుమారుడు ఎక్కడున్నాడో చెప్పాలంటూ' కొట్టడంతో లక్ష్మయ్య ప్రస్తుతం బుట్టాయగూడెం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడని, మతనుకు కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు మెడియం నాగమణి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ తెలిపారు. కుమారుడి ఆచూకీ తెలియదని చెప్పినా పోలీసులు కొట్టారని చికిత్స పొందుతున్న బాధితుడు గురువారం ఆసుపత్రిలో వాపోయారు.ఈ ఘటనకు బాధ్యులైన పోలీసులను తక్షణమే విధుల నుంచి తప్పించాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని లేకుంటే గిరిజన సంఘాలతో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. నాయకులు పోలోజు నాగేశ్వరావు, కారం భాస్కర్, తామా ముత్యాలమ్మ, చుండు బాపిరెడ్డి పాల్గొన్నారు.



బుట్టాయగూడెం సీహెచ్‌సీ ఎదుట గిరిజన సంఘం నాయకుల ధర్నా

వివరాలివి.. వీరన్నపాలెంకు చెందిన గుజ్జు లక్ష్మయ్య కుమారుడు మహేంద్ర ఇదే గ్రామానికి చెందిన బాలిక కొంతకాలంగా ప్రేమించుకుంటూ జీవలు ఇంటినుంచి వెళ్లిపోయారు. బాలిక తరుపువారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ పేరుతో మహేంద్ర తండ్రి లక్ష్మయ్యను స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులు కొట్టారని అందుకే లక్ష్మయ్య ఆసుపత్రి పాలయ్యాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు పోలీసులపై చర్యలు తీసుకోవాలని బంధువులు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. సీఐ వెంకటేశ్వరరావు గురువారం విచారణ చేస్తానని హామీ ఇవ్వడంతో బుధవారం రాత్రి బంధువులు ఇళ్లకు వెళ్లిపోయారు. గురువారం స్టేషన్‌కు వచ్చిన సీఐ విచారణ చేశారు. తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పదోన్నతి పొందిన ఉద్యోగులతో జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, తదితరులు

ఎనిమిది మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరుసిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్‌లో ఎనిమిది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. బుధవారం జడ్పీ క్యాంపు కార్యాలయంలో పదోన్నతి పొందిన ఎనిమిది మంది జూనియర్ అసిస్టెంట్లకు ఆమెతో పాటు జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు సేవాభావంతో పనిచేసి నిబద్ధతకు గుర్తింపుగా పదోన్నతులు ఇవ్వడం సంతోషకరమైన విషయమని, ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి మాట్లాడుతూ ఈ పదోన్నతులు ఉద్యోగులపై మరింత బాధ్యత పెంచుతాయన్నారు. ఏవోలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇప్పటివరకు జిల్లా పరిషత్‌లో జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 74 మందికి పదోన్నతులు కల్పించారు. వీటిలో ఏవోలుగా 27మందికి, సీనియర్ అసిస్టెంట్లుగా 31 మందికి, జూనియర్ అసిస్టెంట్లుగా ఆఫీసుబాయ్, రికార్డ్ అసిస్టెంట్లుగా 16 మందికి పదోన్నతులు కల్పించారు. జడ్పీ ఏవో ఎవీ రాములు, తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



యలమంచిలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): పెదలంక గ్రామానికి చెందిన గెద్దాడ నాగేశ్వరరావు(57) పాము కాటుతో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ కూలీగా జీవనం సాగించే నాగేశ్వరరావు గురువారం పశువులకు గడ్డి కోస్తుండగా పాముకాటు వేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు నాగేశ్వరరావును రాజోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నాగేశ్వరరావు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మతిస్థిమితం కోల్పోయి ఉరి వేసుకుని ఆత్మహత్య


పెంటపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసగా మారిన వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన జోగి వెంకట సత్యనారాయణ(45) గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసగా మారి మతిస్థిమితం కోల్పోయాడు. గురువారం ఉదయం లేచి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం వెంటనే ఇంటిలోకి వెళ్లి ప్యానుకు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య గంగాభవాని ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని సైక్లిస్టు మృతి

కలిదిండి, జూలై 17(ఆంధ్రజ్యోతి): రామిరెడ్డినగర్‌లో లారీ ఢీకొని సైక్లిస్టు మృతి చెందాడు. కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన ఆగతాటి సత్తిబాబు(45) గురువారం ఉదయం ఏలూరుపాడు నుంచి గుర్వాయిపాలెం సైకిల్‌పై వెళ్లి కోళ్ల ఫారంలో కోడి పిల్లలను కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా రామిరెడ్డినగర్ వద్ద వెనుక నుంచి వస్తున్న లోడు లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ ఆత్మహత్య

దెందులూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒక లారీ యజమాని, డ్రైవర్ గొన్నాబత్తుల గణేశ్(38) గురువారం తన లారీకే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏలూరు నగరంలోని కొత్తపేటకు చెందిన గణేశ్ కొంతకాలంగా లారీ నడుపుతున్నాడు. గణేశ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళకు సంబంధించిన వారితో చిన్న వివాదం తలెత్తినట్టు చెబుతున్నారు. ఇది పరిణామం దారితీయడంతో గణేశ్‌ను దుర్భాషలాడి, దాడి చేయగా, మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దెందులూరు మండలం సోమవరప్పాడు పరిధిలో లారీని నిలుపుదల చేసి ఉన్న ప్రదేశంలో అదే లారీ క్యాబిన్ వద్ద తాడుతో ఉరేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గణేశ్‌కు ఇదివరలోనే వివాహం కాగా ఆమెతో విడాకులు తీసుకుని, కొంత కాలంగా వేరే మహిళతో సహజీవనం కొనసాగిస్తున్నాడు. వీరి మధ్య కూడా వివాదాలు తారాస్థాయికి చేరినట్టు సమాచారం. ఈ మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ శివాజీ తెలిపారు.



ఉరివేసుకున్న డ్రైవర్

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు

పోడూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు- పెనుమదం రహదారిలో జైపేటలు మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. భర్తకు గాయాలయ్యాయి. పెనుమదం ఎస్ఆర్ఆర్ పేటకు చెందిన బార్యభర్తలు మల్లిపూడి నందిని(28), మల్లిపూడి రత్నరాజు వీరు మోటార్ సైకిల్‌పై పాలకొల్లు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో భార్య నందిని అక్కడికక్కడే మృతిచెందింది భర్త రత్నరాజు ఫిర్యాదు మేరకు పోడూరు ఎస్ఐ జానకీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పంట చేలో బోల్తాకొట్టిన బస్సు



గాయపడిన విద్యార్థినిని పరామర్శిస్తున్న ఆరిమిల్లి

గమళ్లపాలెంలో స్కూల్ బస్సు బోల్తా

స్వల్పగాయాలు మినహా విద్యార్థులంతా క్షేమం - పరామర్శించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

ఇరగవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో ప్రయాణిస్తున్న స్కూల్ బస్సు అదుపుతప్పి పంట చేలో బోల్తా కొట్టిన ఘటన గురువారం రేలంగి గ్రామ శివారు గమళ్లపాలెంలో చోటు చేసుకుంది. తణుకు పట్టణానికి చెందిన ప్రైవేటు స్కూల్ బస్సు గురువారం ఉదయం విద్యార్థులతో పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువు, వెలగలవారిపాలెం, పెనుమంట్ర, జుత్తిగ, రామేశ్వరం గ్రామం నుంచి పాలి గ్రామం మీదుగా తణుకు బయల్దేరింది. గమళ్లపాలెంలోకి వచ్చే సరికి ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న పంట చేలోకి బోల్తా కొట్టింది. విద్యార్థులు కేకలు వేయడంతో స్థానికులు, రైతులు అప్రమత్తమై బస్సు నుంచి విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఒకవేళ బస్సు పంటచేను వైపు కాకుండా పక్కనే ఉన్న కాలువలోకి బోల్తా కొట్టి ఉంటే పెనుప్రమాదం జరిగేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో బస్సులో 23 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదంలో స్వల్ప గాయాలైన నలుగురిని తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి తిరిగి ఇంటికి పంపారు. కేసు నమోదు చేసి బస్సును, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఇరగవరం ఎస్ఐ జానా సతీశ్ తెలిపారు. విషయం తెలుసుకున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. మరోసారి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన కోరారు. తాడేపల్లిగూడెం ఆర్టీవో జితేంద్ర కౌసర్ బాబో హుటాహుటిన తణుకు ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని,ఆందోళనచెందాల్సిన పనిలేదని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

వాహనాలను తనిఖీ చేసిన ట్రాఫిక్ పోలీసులు

ఏలూరుక్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు, కాలేజీల విద్యార్థులను తీసుకువెళ్ళే బస్సులు, ఆటోల డ్రైవర్లకు గురువారం ఆకస్మికంగా బ్రీత్‌ఎనలైజర్‌తో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించారు. కొంత మంది డ్రైవర్లు మద్యంతాగి వాహనాలు నడుపుతున్నారని సమాచారం అందడంతో చిన్నారుల ప్రాణ భద్రతకు పెనుముప్పుగా మారే పరిస్థితులను నివారించేందుకు ఈ తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కౌన్సెలింగ్ కూడా చేశారు. ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపే కఠిన చర్యలు తీసుకుంటామని,పరిమితికి మించి అదనంగా ప్రయాణికులను ఎక్కించుకుకూడదని, అతి వేగంగా వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యనమదుర్రులో మృతదేహం లభ్యం

భీమవరం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆనారోగ్యం కారణంగా యనమదుర్రు డ్రెయిన్‌లో దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. 39వ వార్డు దుర్గాపురానికి చెందిన వోలేటి భవానీ దుర్గాప్రసాద్(31) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. బావమరిది పాలేటి దుర్గారావు తన బావ కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు బైపాస్ రోడ్డులో ఉన్న వంతెన సమీపంలో పాదరక్షలు కనుగొనడంతో యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి గాలించినా దుర్గాప్రసాద్ కనిపించలేదు. గురువారం వంతెన సమీపంలో దుర్గాప్రసాద్ మృతదేహం కనిపించగా బయటకు తీయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టూటౌన్ ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వృద్ధుడు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు ఆర్ఆర్‌పేటకు చెందిన మెండా నాగేశ్వరరావు(60) తన కుటుంబంతో కలిసి రాత్రి వేళ భోజనాలు ఏలుకుని జీవిస్తున్నాడు. ఈ 10వ తేదీ అర్ధరాత్రి ఏలూరు కర్ణంపంటెన సమీపంలో ఏలూరుకు చెందిన బాలుడు (16) ఒక మోటారు సైకిల్ అపహరించి అతి వేగంగా వెళ్తూ ఢీకొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన చిన్నా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ జి. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ మదువెంకట రాజా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు మీదుగా నడిచే రెండు ప్రత్యేక రైళ్లను ఈ ఏడాది ఆగస్టు 18 వరకు పొడిగిస్తున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. రైల్ నెంబర్ 06085 యర్నాకులం నుంచి పాట్నాకు ప్రతి శుక్రవారం బయలుదేరుతుంది. ఈ రైలు ఈనెల 25 నుంచి ఆగస్టు 15 వరకూ నడపనున్నారు. రైల్ నెంబర్ 06086 పాట్నా నుంచి యర్నాకులం ప్రతి సోమవారం బయల్దేరుతుంది. ఈ నెల 28 నుంచి ఆగస్టు 18 వరకూ ఈ రైలు నడపనున్నారు. ఈ రైళ్లు అలువ, త్రిచూర్, పాలక్కాడ్, కోయంబత్తూర్, తిరుపూర్, ఈరోడ్, సేలం, జోలార్ పెట్టాయ్, కాట్పాడి, అరక్ కోనమ్, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, బాపట్ల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, పలాస, సోంపేట, బరంపూర్, బల్గాన్, కుర్దారోడ్, భ్రహ్మాపూర్, దుర్గాపూర్, అసాన్‌సోల్, చిత్తరంజన్, జంతారా, మధుపూర్, జసిడ్, జాజా, కియోల్, మోకమా, భక్తియార్‌పూర్, పాట్నాసాహెబ్, రాజేంద్రనగర్ టెర్మినల్ రైల్వే స్టేషన్లలో ఆగనున్నాయన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

భీమవరం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న నలుగురిని గురువారం అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపారు. గునుపూడి శివారు రైల్వే అండర్ టన్నెల్ బ్రిడ్జి వద్ద చెరువు గట్టుపై గంజాయి విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో సీఐ సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. అక్కడ గునుపూడికి చెందిన నాయక్ కరుణాకర్, రెల్లి కాలనీకి చెందిన నీలాపు దుర్గాప్రసాద్, నర్సయ్య అగ్రహారానికి చెందిన గాదిని ప్రవీణ కుమార్, జిందా నాగబాబులను అరెస్ట్ చేసి వారి నుంచి 2.8 కేజీలు(రూ.60 వేలు) గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఈ నలుగురిని కోర్టుకు హాజరు పరిచి రిమాండ్ విధించారన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒక యువకుడు మృతి చెందాడు. ఉండికి చెందిన వాకలపాటి శ్రీను(33) ఆతనికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 16న ఏ కారణమో తెలియదు కానీ పురుగుల మందుతాగాడు. తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆతడిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి వైద్యులు సమాచారమిచ్చారు. దీంతో ఔట్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద పోస్టుమార్టం నిర్వహించి గురువారం రాత్రి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

వ్యవసాయ శాఖలో ఏడీల బదిలీ

ఏలూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో పలువురు ఏడీల బదిలీల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మేరకు ఉన్నతాధికారులు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పలువురికి మార్పులు చోటు చేసుకున్నాయి. జె.శశిబిందు నిడదవోలు నుంచి రామచంద్రాపురం, ఏడీఏ మురళీకృష్ణ కైకలూరు నుంచి పాలకొల్లు, ఏడీఏ ప్రసాద్ తాడేపల్లిగూడెం నుంచి నర్సాపురం, ఎ.పార్వతి పాలకొల్లు నుంచి కైకలూరు, ఈఎస్ భాస్కర్‌రావు నర్సాపురం నుంచి తాడేపల్లిగూడెం బదిలీ అయ్యారు.

అక్రమ వ్యాపారాల నిరోధానికి సహకరించండి

ఏలూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): అక్రమ వ్యాపార కార్యకలాపాలను నిర్మూలించేందుకు వాణిజ్య పన్నుల శాఖకు ప్రజలు సహకరించాలని ఏలూరు జిల్లా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎం.నాగార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు, వర్తక సంఘాల వారు అక్రమంగా వ్యాపారాలు చేస్తున్నట్టు తెలిస్తే (87126 31283) నెంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ విషయంలో ప్రజలు తమ వంతు సహకారం తమ శాఖకు అందించాలని ఆయన కోరారు.

25 నుంచి శ్రావణ మాస మహోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయం వద్ద ఈనెల 25 నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణమాస మహోత్సవాలు, ఆలయ వార్షికోత్సవ శిఖర కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ కె.జి.ఎన్.వి.గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు చిన్నబాబు, శ్రీనివాసరావు, ప్రవీణ్, ఆలయ అర్చకులు ఊటుకూరి నాగేశ్వరశర్మ, తమ్మిరాజు వికాస్ శర్మలు తెలిపారు. గురువారం బ్రోచర్లను ఆవిష్కరించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు జరిపి భక్తులకు దర్శనమిస్తామని చెప్పారు. ఆగస్టు 14న ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శిఖర కుంభాభిషేకం, అనంతరం మహా అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ వృత్తి విద్యా కోర్సులో బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఐ.బి.విశ్వనాథ్ తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయంలో బీటెక్ ఈసీఈ లేదా ట్రిపుల్‌ఈలో కనీసం 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. రిటైర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18లోగా దరఖాస్తులు పంపి 19న జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరుకావాలని ఆయన తెలిపారు.

గిరిజనుడిపై దాడిని ఖండించిన సీపీఎం

ఏలూరుకార్పొరేషన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): విచారణ పేరుతో గిరిజనుడిపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు కమిటీ జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలం వీరన్నపాలేనికి చెందిన గుజ్జు మహేంద్రపై అదే గ్రామానికి చెందిన మహిళ విషయమై ఫిర్యాదు చేయడంతో విచారణ పేరుతో తండ్రి గుజ్జు లక్ష్మణుడుపై పోలీసులు విచక్షణా రహితంగా దాడి చేసి గాయపర్చడాన్ని ఆయన ఖండించారు. గిరిజనులు తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం కేసు నమోదు చేసి విచారణ నిర్వహించాలే తప్ప చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం తగదన్నారు.

టీడీపీ కమిటీల నియామకాన్ని పూర్తి చేయండి : కోళ్ల

చింతలపూడి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పార్టీ సంస్థాగత ఎన్నికలను కె.ఎస్.ఎస్, బూత్, క్లస్టర్ యూనిట్, గ్రామ, వార్డు కమిటీలను ఆదివారంలోగా పూర్తి చెయ్యాలని పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో సంస్థాగత ఎన్నికలు, సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం ఎలా జరిగింది, ఇంకా చెయ్యాల్సిన కార్యక్రమాలపై సమీక్షించారు. సంస్థాగత ఎన్నికలను త్వరగా పూర్తి చెయ్యాలని నిర్ణయించారు. ఈ సమీక్షలో నియోజక సమన్వయ కర్తలు కొడాలి వినోద్, బ్రహ్మారాజు, మండల పరిశీలకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ రఘురామకు వినతి



ఏలూరు రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో 1999 ఫిబ్రవరి తరువాత జాయిన్ అయ్యి 2004 వరకు మధ్య ఉద్యోగం పొందిన ఉద్యోగులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ, ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును విద్యుత్ పీఎఫ్ సాధన సమితి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రఘురామకృష్ణంరాజు స్పందిస్తూ విద్యుత్ ఉద్యోగుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని జేఏసీ నేతలు తురగా రామకృష్ణ తెలిపారు. సాధన సమితి నాయకులు కె.కృష్ణకుమార్, వై.శ్రీనివాస్, పి.మురళీకృష్ణ, కె.శ్రీనివాస్ రఘురామను కలిసిన వారిలో ఉన్నారు.

ఆడమిల్లి వంతెనను పరిశీలించిన వైసీపీ బృందం

కామవరపుకోట, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని ఆడమిల్లి సమీపంలో పాత వంతెన గత వారం కూలిన సంగతి తెలిసిందే. ఆ వంతెనను గురువారం వైసీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, వైసీపీ కామవరపుకోట మండలాధ్యక్షులు రాయంకుల సత్యనారాయణ మిత్రబృందం పరిశీలించింది. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ప్రధాన రహదారిలో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా తక్షణమే కొత్త వంతెనను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వీరిశెట్టిగూడెం, ఆడమిల్లి, జోగడిగూడెం తదితర గ్రామాల్లో మృతి చెందిన వైసీపీ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షులు కె.రామకృష్ణ, ఆడమిల్లి వైసీపీ అధ్యక్షుడు బీమేశ్వరరావు, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

ఏలూరు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, శక్తియాప్ వంటి టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని భద్రతగా ఉండాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాల నియంత్రణ, శక్తియాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కులను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ జి దాసు, మహిళా ఎస్ఐ వల్లి పద్మలు మాట్లాడుతూ సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలని సూచించారు.

● పెదపాడు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెదవేగి సీఐ సి.హెచ్.రాజశేఖర్ తెలిపారు. కలపర్రులో సైబర్ నేరాలు - జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, అవసరమైతే వెంటనే 1930 నెంబరుకి కాల్ చేయాన్నారు. ఎస్.ఐ. కట్టా శారదా సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు


కామవరపుకోట, జూలై 17(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు పేర్కొన్నారు. గురువారం తడికలపూడి పోలీస్ స్టేషన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలోనైనా అనుమతులు లేకుండా ఎలాంటి మట్టి తవ్వకాలు జరిపినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామన్నారు. బైక్ రేస్‌లు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల వద్ద, పాన్‌షాపులు, కిరాణా షాపుల వద్ద చట్టవిరుద్ధమైన మాదకద్రవ్యాలు, గంజాయి, గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు అమ్మకాలు జరిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బండి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పేకాట, జూదం వంటి సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.



సానిగూడెంలో నిరుపయోగంగా హెల్త్ క్లినిక్

క్లిక్ కాని..క్లినిక్‌లు

(5వ పేజీ తరువాయి)



ద్వారకాతిరుమల వసంత్ నగర్‌కాలనీలో వీహెచ్‌సీ దుస్థితి

దేవరగుంట, జంగంగూడెం, మరిబంధంలో పూర్తికాగా ఆరు గ్రామాల్లో నిర్మాణానికి ముందడుకు పడలేదు. కొయ్యలగూడెం మండలంలో 21 గ్రామ ఆరోగ్య కేంద్రాలకు శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టారు. రాజవరం-1, యర్రంపేట -1, సరిపల్లి, బోడిగూడెం, గ్రామాల్లో మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకుని వైద్య సేవలందిస్తున్నాయి. మిగిలిన 17 అసంపూర్తిగానే మిగిలాయి. ఒక్కొక్క ఆరోగ్య కేంద్రానికి 20.8 లక్షలు నిధులు మంజూరు చేశారు. అయినా పనులు పూర్తి కాకపోవడంతో ఈ ఆరోగ్య కేంద్రాలను అద్దె భవనాల్లో కొనసాగించడంతో ఆ భార మంతా పంచాయతీలపై పడుతోంది.

నగరంలో యథేచ్ఛగా భారీ వాహనాల హల్‌చల్



ఫైర్ స్టేషన్ సిగ్నల్ లైట్ల వద్ద ఆగిఉన్న టిప్పర్ లారీ

ఏలూరు క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో రోజు రోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతోంది. ఇంకోవైపు నిబంధనలు అతిక్రమించి అడ్డగోలుగా నగరం మీదుగా వెళ్తున్న భారీ వాహనాలతో మరింత ఇబ్బంది తలెత్తుతోంది. నగరం మీదుగా 24 గంటలూ టిప్పర్ లోడు లారీలు, భారీ వాహనాలు అతివేగంగా వెళ్తున్నా పట్టించుకునేవారే లేకుండాపోయారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ సాయంత్రం 3.30 గంటల నుంచి 6గంటల వరకూ సాధారణంగా విద్యార్థుల వాహనాలు, స్కూల్ బస్సులు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి సమయాల్లో కూడా ఏలూరులో భారీ వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుని ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఇంటింటికీ ఎమ్మెల్యేలు

ఏలూరు రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ నిబంధనల పేరుతో కొల్లేరు ప్రజలను అధికారులు ఇబ్బంది పెట్టడం సరికాదని, కొల్లేరు ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం ఏలూరు రూరల్ మండలంలోని గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, కొక్కిరాయలంక గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించారు. కొల్లేరు గ్రామాల్లో అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు నంబూరి నాగరాజు, నాయకులు నేతల రవి, ఎంపీడీవో వెన్న శ్రీలత, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● లింగపాలెం: ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినట్టు ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు. బాదరాల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. గత ప్రభుత్వం పాలనలో అస్తవ్యస్తమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతూ సీఎం చంద్రబాబు ప్రజలకు సుపరిపాలన అందిస్తోందన్నారు. అనంతరం గ్రామంలో గోకులం షెడ్డును ప్రారంభించారు. సర్పంచ్ బొల్లినేని శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 7వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండుకళ్లుగా భావించి సుపరిపాలన అందిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజాసమస్యలు పట్టించుకోలేదన్నారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, పాల్గొన్నారు.

నగర పంచాయతీలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

చింతలపూడి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో ప్రధాన రోడ్లలోని గురుభట్లగూడెం రోడ్డులో ఆక్రమణల తొలగింపు గత రెండు రోజులుగా సాగుతోంది. నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే ఈ రోడ్డులో పలుచోట్ల గోతులు కూడా ఉన్నాయి. దీనికితోడు దుకాణాలు, ఇళ్ల ముందు సిమెంటు కాంక్రీట్ వేయడంతో వాటి ముందు చిన్నచిన్న బడ్డీలు వెలసి వాటి మధ్య ఆటోలు నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. బోసుబొమ్మ సెంటర్ నుంచి సాయిరాం థియేటర్ వరకు మునిసిపల్ అధికారులు డ్రెయినేజి నుంచి ముందుకు వచ్చిన ఆక్రమణలను తొలగిస్తున్నారు. డ్రెయినేజీలు అడ్డం పెట్టుకుని తోపుడు బండ్లు, బడ్డీల వ్యాపారుల ఆక్రమణలు శృతిమించాయి. దీంతో డ్రెయినేజి ఆక్రమణలను తొలగించి కొంత ఈ బడ్డీలను వెనక్కి జరిపే అవకాశం ఉందని,దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని అధికారులు ఈ ఆక్రమణల తొలగింపు చేపట్టారు. అయితే అవసరంలేని చోట్ల కూడా తొలగించడంతో వర్షం పడినప్పుడు రోడ్ల పైకి నీరు వస్తుందన్నారు. గోతులు పూడ్చడానికి ఈ ఆక్రమణలను తీసిన సిమెంటు మెటీరియల్ ఆ గోతుల్లో పోస్తే గోతులకు సమస్యకు పరిష్కారం దొరుకుతుందని స్థానికులు కోరుతున్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

ఏలూరు రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత కొద్ది మేర ఉపశమనం కలిగించే చెట్లు.. అలాంటి చెట్లను నాటి వాటిని కాపాడాల్సిన అధికారులు ఎన్నో ఏళ్లుగా ఉన్న చెట్లను కొట్టివేసిన సంఘటన ఏలూరు జడ్పీ కార్యాలయంలో జరిగింది. విలువైన చెట్లును కాపాడుకోవల్సింది పోయి, నిర్ధాక్షిణ్యంగా నరికి వేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. జడ్పీ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లకు అడ్డుగా ఉన్నాయనో, మరేదో కారణంగా పచ్చదనంపై వేటు వేస్తున్నారు. తమ అవసరాలకు చెట్లను నరికితే ఆక్షేపించే అధికారులు ఇప్పుడెందుకు పట్టించుకోవడంలేదో తెలియడం లేదు.



జడ్పీ కార్యాలయంలో నరికివేసిన చెట్టు

గురుకులంలో సమస్యలు పరిష్కరిస్తా

చింతలపూడి, జూలై 17(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో సమస్యలు నివేదిస్తే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. గురువారం అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నీటి సమస్య పరిష్కారం కోసం బోరు తవ్వకానికి ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఎంపీపీ బి.రాంబాబు, కూటమి నాయకులు తాటి అప్పారావు, కొత్తపూడి శేషగిరిరావు, ధర్మరాజు, విజయకుమారి పాల్గొన్నారు.

ఐదుగురితో కమిటీలు ఏర్పాటు చేయాలి

కామవరపుకోట, జూలై 17(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఇటీవల సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేస్తుందని, వాటి వలన రాజకీయ ప్రాబల్యం ఉంటుందని, అలా కాకుండా ఐదుగురితో కమిటీలు వేస్తే సభ్యులకు మెరుగైన సేవలందుతాయని సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు గురువారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వానికి సూచించారు. సహకార సంఘాల్లో నియమిస్తున్న కమిటీల్లో అన్ని పార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా మరింత ప్రయోజనం కలుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కొయ్యలగూడెంలో భారీ వర్షం

కొయ్యలగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెంలో భారీ వర్షం కురిసింది.గత కొన్ని రోజులుగా వర్షాలు లేక ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమయంలో ఒక్కసారిగా గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండలంలోని కొయ్యలగూడెం, కన్నాపురం గ్రామాల్లో వర్షం కురిసింది.

ఎకరా భూమి 1.30 లక్షలకు వేలం

ఉంగుటూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): నల్లమాడు (కంసాలిగుంట)లోని దేవదాయ శాఖకు చెందిన భూమికి గురువారం విశ్వేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో వేలం నిర్వహించారు. పదేళ్లుగా ఎటువంటి పాట లేకుండా సర్పంచ్ భర్త శ్రీకాంత్ సాగు చేసుకుంటున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో దేవదాయ శాఖ అధికారులతో కార్యనిర్వహణాధికారి రవి శంకర్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ నాగమునేశ్వర రావు సమక్షంలో సాగుకు వేలం వేయగా సర్పంచ్ భర్త శ్రీకాంత్ రికార్డు స్థాయిలో ఎకరాకు రూ.1.30 లక్షలకు పాడారు. ఈ వేలంలో నలుగురు పోటీ పడ్డారు.

నూకాలమ్మకు ఆషాఢ సారె

జంగారెడ్డిగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆషాఢ మాసం సందర్భంగా పద్మ థియేటర్ ఎదురుగా ఉన్న శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ కమిటీ తరపున నూకాలమ్మకు గురువారం ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కురెళ్ళ రాంబాబు శర్మ మాట్లాడుతూ గత మూడేళ్లుగా గ్రామ దేవతలకు సారె సమర్పిస్తున్నట్టు తెలిపారు. భక్తుల సహకారంతో ఇప్పటి వరకు 13 దేవాలయాలకు సారె సమర్పించినట్టు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పోలుపర్తి రాము, గాలి నూకరాజు, చిట్లూరి సుబ్బారావు, ఎం. వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాన్ని పునఃప్రారంభించాలి

కుక్కునూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): అమరవరం సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని పునఃప్రారంభించాలని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ దాసరి రెడ్డిని పూర్వ విద్యార్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఇక్కడ వసతి గృహంలో ఎందరో విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరారని పూర్వ విద్యార్థులు తెలిపారు. కొయ్యే నాగేశ్వరరావు, మేకా ఈశ్వరయ్య వెంకటేశ్వర్లు, రామచంద్రరావులు ఉన్నారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న అధికారులు

పాఠశాల ఆకస్మిక తనిఖీ

కుక్కునూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి):కుక్కునూరు మండల కేంద్రంలోని ఆశ్రం బాలికల పాఠశాలను డిప్యూటీ డైరెక్టర్ శ్రీవిద్య మోనటరింగ్ అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. అలాగే మాధవరం బాలుర ఆశ్రం పాఠశాలను మోనటరింగ్ అధికారి సిరమయ్య, రాజేశ్వరి తనిఖీ చేశారు. విద్యాబోధన, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో భోజన వసతులు,విద్యాకిట్‌లు, యూనిఫాంల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

పుష్కలంగా సాగునీరందిస్తాం

దెందులూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా రెండు పంటలకు పుష్కలంగా అందించేలా చర్యలు తీసుకున్నట్టు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గురువారం దెందులూరులోని అలుగులగూడెం దారిలో ఉన్న సీతంపేట కాలువపై రైతులు రకాపోకలు సాగించేందుకు రూ.78 లక్షలతో నిర్మించిన సైఫన్‌ను సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు పర్వతనేని రంగారావు, బ్యాంక్ అధ్యక్షులు గారపాటి కొండయ్య చౌదరి, సంపంగి వేణుగోపాల తిలక్, ఇప్పిలి వెంకటేశ్వరరావులతో కలిసి ప్రారంభించారు. వీరమాచినేని ప్రభాకర్, ఏపీ యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, తోట యేసమ్మ, బూర్ల బాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.



సైఫన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

కొండయ్య చౌదరి, బాబి ప్రమాణ స్వీకారం

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో దెందులూరు సొసైటీ అధ్యక్షుడిగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి డైరెక్టర్లతో కలిసి ప్రమాణస్వీకారం చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, మోతుకూరి నాని, సంపంగి వేణుగోపాల తిలక్, ఇప్పిలి వెంకటేశ్వరరావు ఉన్నారు. గంగన్నగూడెం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడిగా టీడీపీ నాయకులు కూచిపూడి వెంకట కిశోర్(బాబి), డైరెక్టర్లుగా మరీదు సత్యనారాయణ, చోద్దిమెళ్ల అచ్చమ్మలు పార్టీ నాయకులతో కలిసి బాబి ప్రమాణస్వీకారం చేశారు.

గ్రామదేవతకు ఆషాఢ సారె

దెందులూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): గాలాయగూడెం గ్రామదేవత గంగానమ్మకు గ్రామస్థులు ఆషాఢ సారె గురువారం సమర్పించారు. వేదపండితులు, బ్యాండ్, సన్నాయిలతో సంప్రదాయబద్ధంగా గ్రామస్థులు, ముత్తైదువులు ఊరేగింపుగా రకరకాలు పిండివంటలు, 16 రకాల పండ్లతో తరలివచ్చి అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. లక్ష్మీపురంలోని సర్పంచ్ మేకా కనకరాజు, గ్రామస్థుల ఆధ్వర్యంలో గ్రామ దేవత గంగానమ్మకు మేళ,తాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారి ఆషాఢం సారె, పసుపుకుంకమలు సమర్పించారు. పెదవేగి సొసైటీ చైర్మన్ తాతా సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన

పోలవరం,జూలై 17(ఆంధ్రజ్యోతి):పోలవరం, ఇటుకలకోట పంచాయతీల్లో గురువారం 65.10 లక్షల రూపాయలతో మంచినీటి ట్యాంకుల నిర్మాణాలకు ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో శంకుస్థాపనలు నిర్వహించారు. పోలవరం పంచాయతీలో కమ్మరగూడెం, నూతనగూడెం, ఇటుకలకోట గ్రామంలో మంచి నీటి ట్యాంకుల పనులకు కొబ్బరి కాయలు కొట్టి శంకుస్థాపనలు చేశారు. కూటమి నేతలు కుంచే దొరబాబు, గునపర్తి చిన్ని, కరిబండి నాగరాజు, కొణతాల ప్రసాద్, నల్లా రాంబాబు, పాదం ప్ర సాద్, జల్లేపల్లి వెంకట నరసింహారావు, స్వాతి, పోతుల శ్రీను, పిల్లి నాగరాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాం అందజేత


ఏలూరుటూటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసించి భవిష్యత్తులో రాణించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచిపేరు తేవాలన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నోసౌకర్యాలు కల్పించిందని వాటిని వినియోగించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ప్రిన్సిపల్ ఏ.రాజ్‌కృష్ణ, పాల్గొన్నారు. అదేవిధంగా రూ.46 లక్షలతో కొనుగోలు చేసిన జేసీబీని వెహికల్ షెడ్‌లో గురువారం ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్‌లు ప్రారంభించారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి చర్యలు

ఏలూరుటూటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నమస్తేడే కార్యక్రమం నిర్వహించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంకులో పని చేసే కార్మికులకు పీపీ.కిట్‌లు, యాప్రాన్‌లు, ఆయుష్మాన్ భారత్ బీమా కార్డులు అందజేశారు. అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, ఎంఈ సురేంద్రబాబు, కార్పొరేటర్లు ఎస్.శ్రీనివాసరావు, కర్రి శ్రీనివాసరావు, బత్తిన విజయకుమార్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

జంగారెడ్డిగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పాఠశాలల వాహనాలు నడపి చిన్నారుల ప్రాణాలకు ముప్పు తీసుకురావద్దని సీఐ సుభాష్ డ్రైవర్లను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పాఠశాలల బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ల ద్వారా తనిఖీలు చేశారు. పాఠశాలల బస్సు డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నారని వచ్చిన సమాచారం మేరకు ఈ తనిఖీలు చేసినట్టు సీఐ సుభాష్ తెలిపారు.



అంగన్‌వాడీలకు టీవీని అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉత్సాహంగా పల్లెపల్లెకు పత్సమట్ల

ఉంగుటూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిపురం, నాచుగుంట గ్రామాల్లో పల్లెపల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచులు యేలేటి సునీత, రాజేంద్ర, ఇమ్మణ్ణి గంగాధరరావు, ఎంపీటీసీ గంటా ఉషారాణి, చిట్టూరి హరిబాబు పాల్గొని మొక్కను నాటారు. అనంతరం భీమడోలు ఐసీడీఎస్ పరిధిలోని 126 అంగన్వాడీ కేంద్రాలకు టీవీలు మంజూరవగా గురువారం సీడీపీవో రాజశేఖర్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చేతుల మీదుగా నాచుగుంటలో జరిగిన పల్లెపల్లెకు జనసేన కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాలకు అందించారు. సర్పంచ్ యేలేటి సునీత, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, టీడీపీ నాయకుడు ఇమ్మణ్ణి గంగాధరరావు, ఎంపీటీసీ గంటా ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, శారద, తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ



మందులు పరిశీలిస్తున్న రమేశ్

కొయ్యలగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పశువైద్యశాలను ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.రమేశ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హాస్పటల్ పరిశీలించి మందులు పరిశీలించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాసన్‌ను పశువులకు ఈ ప్రాంతంలో తరచూ వచ్చే వ్యాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు తక్షణమే వైద్యసేవలందించాలని కోరారు. అలాగే టీకాలు అందించి పశువులకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

నిడమర్రు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎనికేపల్లి ఎంపీపీ పాఠశాలలో పిల్లలకు గురువారం గణపవరం లయన్స్ క్లబ్ సభ్యులు నోట్ పుస్తకాలు, పౌష్టికాహారం అందించారు. గణపవరం లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లంకి నరేశ్ కుమార్, కిలారి రవిబాబు, కోశాధికారి కె.ఎస్.ఎన్.మూర్తి, హెచ్ఎం సి.హెచ్.తులసి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం

ద్వారకాతిరుమల, జూలై 17(ఆంధ్రజ్యోతి): దొరసానిపాడు సచివాలయ సిబ్బంది బదిలీ అయిన సందర్భంగా వారికి గురువారం చిరుసత్కారం నిర్వహించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ వాసు, డిజిటల్, హార్టికల్చర్ అసిస్టెంట్లు అంకిత, మహేశ్, మహిళా పోలీస్ కమల, ఏఎన్ఎం సునీత, ఈఏ సోనీలను టీడీపీ నేతలు సత్కరించారు. ఎంపీటీసీ అల్లాడ హరేరామకృష్ణ, టీడీపీ గ్రామాధ్యక్షుడు మద్దిపాటి రత్నాజీ, కారుమంచి మురళి, పసుమర్తి సోమశేఖర్, పాకలపాటి రమేష్, మద్దాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి రాంకీబాబు పాల్గొన్నారు.

● పెదపాడు: నాయుడుగూడెంలో టీడీపీ గ్రామా ధ్యక్షులు అట్లూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బదిలీ, పదోన్నతులపై వెళ్తున్న ఆరుగురు సచివాలయ ఉద్యోగులను గురువారం సత్కరించారు. గ్రామపెద్ద అక్కినేని వంశీకృష్ణ, ఈవో ఎం.శ్రీనివాస్, విశ్రాంత వీఆర్వో యుగంధర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ డీఈఈగా భీమేశ్వరరావు

ఉంగుటూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ డి.ఈ.ఈ.గా రాళ్లపల్లి బీమేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న డీఈఈ ఎన్.శ్రీనివాస్ అమలాపురం బదిలీపై వెళ్లారు. భీమేశ్వరరావు గతంలో నారాయణపురం విద్యుత్ ఏ.ఈ.గా పనిచేయడంతో స్థానికంగా సమస్యలపై అవగాహన ఉందని పలువురు పేర్కొంటున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ఉంగుటూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి):స్థానిక హైస్కూల్ విద్యార్థులకు బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. శాంతి కల్చరల్ సొసైటీ కళాజాత బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ(1098) నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. హెచ్ఎం మద్దా రాజా రవీంద్ర, చైల్డ్ రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రవిబాబు, అడ్వకసీ సభ్యురాలు సి.హెచ్.రేఖ,ఉపాధ్యాయులు బోడపూడి పద్మ, సి.హెచ్.శ్రీనివాసరావు, పండూరి కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బుట్టాయగూడెం, జూలై 17(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం, రామారావుపేట సబ్ స్టేషన్ల పరిధిలోని కొవ్వాడ, రెడ్డిగణపవరం, కొమ్ముగూడెం, గురురాఘవేంద్ర, రామారావుపేట టౌన్, బుట్టాయగూడెం టౌన్ ఫీడర్లకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

వేగివాడ సబ్‌స్టేషన్ పరిధిలో..

దెందులూరు: వేగివాడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కె.కన్నాపురం, బెత్తవరంతో పాటు కవ్వగుంట, జగన్నాథపురం, వెంకటకృష్ణాపురం, గార్లమడుగు, వంగూరు, లక్ష్మీపురం, గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు.

కొయ్యలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో..

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు జంగారెడ్డిగూడెం ట్రాన్స్‌కో ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరింపూడి, గవరవరం, అంకాలగూడెం, బోడిగూడెం, మంగపేట, శ్రీరంగపట్నం, అచ్యుతాపురం గ్రామాలకు వ్యవసాయ విద్యుత్ ఉండదన్నారు.

కార్యదర్శిని నియమించండి


పోలవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని పాలకవర్గ సభ్యులు గురువారం తెలిపారు.కార్యదర్శి ఇటీవల బదిలీపై వెళ్లడంతో ఇంచార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యదర్శి పంచాయతీ కార్యకలాపాలు పట్టించుకోవడం లేదని, దీనివల్ల అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోతున్నాయని అధికారులు స్పందించి కార్యదర్శిని నియమించాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు మంగిన కొండ, మంగిన పోశిరత్నం, ఎం.పార్వతి, పి.నారాయణరావు కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పెదపాడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో గురువారం సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. పలు వాహనాలకు సంబంధించి ధృవీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు జరిగే నష్టాలు వివరించి జరిమానాలు విధించారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
నూజివీడు, కైకలూరు
7 www.andhrajyothy.com ● శుక్రవారం 18 జూలై 2025

ఆకాశంలో విరబూసిన సూర్యకిరణం



కలిదిండి, జూలై 17(ఆంధ్రజ్యోతి): కలిదిండిలో సూర్యాస్తమయ సమయంలో ఆకాశంలో ఎరుపు రంగుతో సూర్యకిరణం విరబూసి దర్శనమిచ్చింది. గురువారం ఉదయం మధ్యాహ్నం మూడు గంటల వరకు వేసవిని తలపించే ఎండ కాసింది. ఆ తర్వాత చల్లబడిన వాతావరణంలో విరబూసిన సూర్యకిరణాన్ని స్థానికులు వీక్షించారు.

వట్టిగుడిపాడు విద్యార్థికి మంత్రి పార్థసారథి అభినందనలు

ఆగిరిపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వట్టిగుడిపాడు గ్రామానికి చెందిన యలమర్తి జాన్ విల్సన్ ఆల్ ఇండియా పోటీ పరీక్షల్లో పాల్గొని ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి ఐఐటీ కాలేజీలో సీటు పొందిన విద్యార్థినిని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. ప్రోత్సాహకంగా విద్యార్థికి రూ.25000 గురువారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నక్కబోయిన వేణు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పిన్నిబోయిన చింతరావు, చింతపల్లి చక్రధర్, సింహాద్రి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా

'రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి'

మండవల్లి/నూజివీడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకర్లు చూడాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్‌బాషా తెలిపారు. మండవల్లి మండలంలోని గన్నవరం రైతు సేవా కేంద్రం మండవల్లి ఇండియన్ బ్యాంకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రైతులకు సంబంధించిన బీమా ప్రీమియంను బ్యాంకులో కట్టించుకోవాలని కోరారు. కౌలుదారు కార్డులు, వ్యవసాయ ఇన్‌పుట్ సబ్సిడీలు, ప్రస్తుతం సాగులో నెలకొన్న పరిస్థితులపై కైకలూరు మండవల్లి సబ్‌డివిజన్ పరిధిలోని ఏవోలుతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ వెంకటమణి ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజివీడు డివిజన్ సమావేశంలో..

నూజివీడు డివిజన్‌లోని నాలుగు మండలాల సిబ్బందితో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్‌బాషా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంట బీమా నమోదు చేయించుకునేలా చూడాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఇంకా ఎవరైనా రైతులు పేర్లు నమోదు కానట్టయితే వారందరూ గ్రామ రైతుసేవా కేంద్రం వద్ద సంప్రదించి వివరాలను అందిస్తే అర్హులైన ప్రతీ ఒక్క రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చేస్తామని తెలిపారు. నూజివీడు ఏడీఏ ఆలూరి చాముండేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.



చావలిపాడు చెరువుగట్టు ఏర్పాటు వద్ద బందోబస్తుగా వున్న పోలీసులు

భారీ బందోబస్తు నడుమ చెరువుకు గట్టు

మండవల్లి జూలై17(ఆంధ్రజ్యోతి):మండవల్లి మండలం చావలిపాడులో గురువారం ఉదయం పోలీసుల భారీ బందోబస్తు నడుమ మంచినీటి చెరువుకు గట్టును నిర్మించారు. రెండువేల జనాభా గల చావలిపాడు మంచినీటి చెరువు విస్తీర్ణం రెండు ఎకరాలు మాత్రమే ఉండడంతో గతంలో పంచాయతీ 13 ఎకరాల సొసైటీ చెరువులో ఐదు ఎకరాల మంచినీటి చెరువుగా ఏర్పాటు చేయాలంటూ తీర్మానం చేశారు. దీంతో 40 ఏళ్లుగా సొసైటీ చెరువు ద్వారా లబ్ధి పొందుతున్న సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం స్థానిక సొసైటీ చెరువులోని ఐదు ఎకరాలను మంచినీటి చెరువుగా ఏర్పాటు చేసేందుకు కైకలూరుటౌన్, రూరల్ సీఐలు కృష్ణ, రవికుమార్ మండవల్లి తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో వందమంది పోలీసులు పర్యవేక్షణ నడుమ ఉదయం చెరువుగట్టును ఏర్పాటు చేశారు. గ్రామ ప్రముఖులు తలారి వెంకటస్వామి, రామారావు అన్నిబాబు, కార్యదర్శి కొండలు పనులను పర్యవేక్షించారు.

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

నూజివీడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నాలుగో రోజు నూజివీడు పురపాలక సంఘం కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. గురువారం పురపాలక సంఘ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు గత ఏడేళ్ల నుంచి జీతాలు పెంచకపోవడం చాలా దారుణమని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీవో నంబరు 36 ప్రకారం జీతాలు పెంచాలన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎన్ఆర్ హనుమాన్లు, మునిసిపల్ యూనియన్ నాయకులు రంగారావు, అప్పారావు, రామారావు పాల్గొన్నారు.





ముదినేపల్లి మండలం పేరూరులో హెల్త్ క్లినిక్ భవనం.. కొమ్మరులో పునాదుల స్థాయిలోనే భవనం

క్లిక్ కాని..క్లినిక్‌లు

(5వ పేజీ తరువాయి)

దేవరగుంట, జంగంగూడెం, మరిబందంలో పూర్తికాగా ఆరు గ్రామాల్లో నిర్మాణానికి ముందడుకు పడలేదు.

● **కొయ్యలగూడెం :** మండలంలో 21 గ్రామ ఆరోగ్య కేంద్రాలకు శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టారు. రాజవరం-1, యర్రంపేట-1, సరిపల్లి, బోడిగూడెం, గ్రామాల్లో మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకుని వైద్య సేవలందిస్తున్నాయి. మిగిలిన 17 అసంపూర్తిగానే మిగిలాయి. ఒక్కొక్క ఆరోగ్య కేంద్రానికి 20.8 లక్షలు నిధులు మంజూరు చేశారు. అయినా పనులు పూర్తి కాకపోవడంతో ఈ ఆరోగ్య కేంద్రాలను అద్దె భవనాల్లో కొనసాగించడంతో ఆ భారమంతా పంచాయతీలపై పడుతోంది.

యథేచ్ఛగా ఆక్రమణలు

» కలిదిండి మార్కెట్ యార్డు వెంబడి దుకాణాలు, లారీ ఆఫీసులు

కలిదిండి, జూలై 17(ఆంధ్రజ్యోతి): కలిదిండి మార్కెట్ యార్డు వెంబడి యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర రహదారి పక్కనే మార్కెట్ యార్డు ప్రహరీ వెంబడి అక్రమంగా దుకాణాలు, లారీ ఆఫీసులు, కలప వ్యాపారం సాగుతున్నాయి. కొంతమంది సిమెంట్ గోడలతో రేకుల షెడ్లు నిర్మించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పది షాపులు ఏర్పాటుచేశారు. వీటి ముందు అక్రమ కట్టడాలు ఉండడంతో ఆ షాపులు రోడ్డు మీదకు కనిపించడం లేదు. వ్యాపారం లేక షాపులు వెలవెలబోతున్నాయి. ప్రతీ ఏడాది మార్కెట్ యార్డు వెంబడి ఆక్రమణలు పెరుగుతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ యార్డు ఆవరణ పక్కనే ఏపీ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గొడౌన్లు ఉన్నాయి. ఈ గొడౌన్లలోకి వచ్చే బియ్యపు లోడు లారీల వల్ల ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



అక్రమ కట్టడాలు..



రేకుల షెడ్డులో కలప వ్యాపారం

ప్రమాదకరంగా రోడ్డు

» వడాలిలో రోడ్డు ధ్వంసం..
» మూసివేసిన ముళ్ల పొదలు

ముదినేపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : వడాలి-తాడినాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు గోతులమయం కావడమే కాకుండా పలు చోట్ల ముళ్లపొదలు, వృక్షాలతో మూసుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఓఎన్‌జీసీకి చెందిన భారీ వాహనాలతో పాటు, పలు పరిశ్రమలలోడు వాహనాల రాకపోకలు పెరగడంతో ఈ రోడ్డు ధ్వంసమైంది. సుమారు పదిహేనేళ్లుగా ఈ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. వడాలి నుంచి చిగురుకోట గ్రామ శివారు వరకు సుమారు 8 కిలోమీటర్ల దూరం ఈ రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా పరిణమించింది. పలుచోట్ల రోడ్డు కోసుకుపోయి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పెదకామనపూడి గ్రామం వద్ద రోడ్డు ధ్వంసమైంది. ఇటీవల రోడ్డుకు ప్రత్యేక మరమ్మతులు చేపట్టిన సమయంలో వడాలి-చిగురు మధ్య రహదారి మరమ్మతు పనులకు నోచుకోలేదు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెదకామనపూడి వద్ద కోతకు గురైన రోడ్డు



రోడ్డు వెంబడి పెరిగిన చెట్లు



పెదగొన్నూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద టాయిలెట్లను పరిశీలిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు

గృహాల నుంచి చెత్త సేకరణ జరుగుతుందా ?

» స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు

ముదినేపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదగొన్నూరు, పెనుమల్లి గ్రామపంచాయతీ ఏరియాలో గురువారం కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటించి పలు అంశాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రజోపయోగ, ప్రజారోగ్య పథకాలు అమలు జరుగుతున్న తీరును అయా గ్రామాల్లోని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో గృహాల నుంచి చెత్త సేకరణ జరుగుతుందా? లేదా, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, శుభ్రతను పాటించడం వంటి విషయాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి వాటి పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయా? లేదా అనేది పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ అకడమిక్ మేనేజ్‌మెంట్ అండ్ స్టడీస్ ప్రతినిధులు పి.సత్తిబాబు, శివకుమారి ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం సభ్యులు గ్రామాల్లో పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో అశోక్, పంచాయతీల కార్యదర్శులు గిరిజ, బీవీ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

చాట్రాయి, జూలై 17(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. స్కూల్, కాలేజీల బస్సులు, ఆటోలు ఇతర వాహనాల డ్రైవర్లను ఆపి బ్రీత్ ఎన్‌లైజర్‌తో తనిఖీ జరిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల కొంత మంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారనే సమాచారంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు చెప్పారు. విద్యా సంస్థల యాజమాన్యాలు డ్రైవర్ల అలవాట్లు ఆరోగ్య పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. అనంతరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వాడడం వల్ల వచ్చే దుష్ఫలితాలు సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. మీ చుట్టుపక్కల జరిగే అన్యాయాలు, అసాంఘిక కార్యకలాపాలను పోలీస్‌స్టేషన్‌కు గాని, 112కు డయల్ చేసి తెలపాలని, సమాచారమిచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. హెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల కోసం నగదు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

హెచ్‌ఎంలు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

ఆగిరిపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంచుకుని, ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్షణ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ పంకజ్ కుమార్ సూచించారు. గురువారం తోటపల్లిలోని హిల్ స్కూల్‌లో హెచ్‌ఎంలకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల నాయకత్వం, అభివృద్ధి లక్షణాలపై జిల్లాలోని 28 మండలాల నుంచి సుమారు 200 మందితో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారగలరన్నారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఎంలు హిల్ స్కూల్ విద్యార్థుల అభివృద్ధికి సహాయంగా పాఠశాల సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, హిల్ స్కూల్ సెక్రటరీ తాతినేని లక్ష్మీలకు రూ.1,14,700 అందజేశారు.





ఈదర గ్రామంలో కరపత్రాలు అందిస్తున్న మంత్రి పార్థసారథి.. వడాలిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నేత నరసింహారావు, పార్టీ నాయకులు

ప్రతి ఇంటికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలే లక్ష్యం

» మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ఈదర గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు సంబంధిత వార్డు నాయకులకు మంత్రి సూచించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రానికి తరలి వస్తున్నారని, రూ.6లక్షలు 50వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. రానున్న నాలుగేళ్ల కాలంలో 20 లక్షలు ఉద్యోగాలు యువతీ, యువకులు అందజేయాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధికి బాటలు వేసు కుంటుందని టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆయన 'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రచార కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు. వడాలిలో ఈ కార్యక్రమం ముగిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పెదగొన్నూరు డీసీ వైస్ చైర్మన్ కట్టా కోటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు నక్కా అప్పారావు, కార్యదర్శి కట్టా రామయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు గ్రామ కమిటీతోపాటు, యూనిట్ ఇన్‌చార్జిలు బూత్ కన్వీనర్లను అభినందించారు.





చనుబండ పీఏసీఎస్ చైర్మన్‌గా మోరంపూడి బాధ్యతలు.. మాట్లాడుతున్న పోలవరం పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్

అట్టహాసంగా పీఏసీఎస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

చాట్రాయి, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు పీఏసీఎస్‌లకు నియమితులైన త్రిసభ్య కమిటీలు గురువారం అట్టహాసంగా పదవీ ప్రమాణ స్వీకారాలు చేశారు. చనుబండ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మోరంపూడి శ్రీనివాసరావు, సభ్యులుగా కంచు మల్లయ్య, ఎన్.ప్రభాకరరావు, పోలవరం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా యర్రా ప్రసాద్, సభ్యులుగా తాణంకి దేవరాజు, యర్రోజు పద్మావతి, తుమ్మగూడెం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా దామెర సత్యరామ్‌కుమార్, సభ్యులుగా మద్దాల చిట్టిబాబు, తివేది ఆదెమ్మ, నరసింహారావుపాలెం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కట్టా నాగదుర్గారావు, సభ్యులుగా టి.సురేష్‌రెడ్డి, నక్కా ఝాన్సీరాణి పదవీ ప్రమాణ స్వీకారాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, తేళ్ళూరి శేఖర్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, కూటమి నాయకులు నోబుల్‌రెడ్డి, ప్రదీప్, మారేష్, చిమటబోయన పుల్లారావు, నక్కా రాము, దిలీప్, నెక్కలపు వెంకటేశ్వరరావు, తుమ్మల జగన్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లి త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ

నూజివీడు టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపల్లి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ గురువారం బాధ్యతలు స్వీకరించింది. పీఏసీఎస్ అధ్యక్షుడిగా అక్కినేని బెనర్జీ, సభ్యులుగా మందపాటి తిరుపతయ్య, జుజ్జవరపు రాణి బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొమ్మన నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యనమదుల శ్రీనివాసరావు, పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ అక్కినేని చంద్రశేఖర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు సుంకర బాబి, టీడీపీ నాయకులు ఎన్ఆర్ఐ అక్కినేని ప్రేమ్ తదితరులు సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు అక్కినేని ఆంజనేయప్రసాద్, సంఘ కార్యదర్శి ఎ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న అక్కినేని బెనర్జీ



శ్రీహరిపురం సర్పంచ్ విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీహరిపురం సర్పంచ్‌కు ఘన సత్కారం

ముదినేపల్లి,జూలై 17(ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం పంచాయతీ సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావును గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు సత్కరించారు. గత 35 రోజులుగా పలు దేశాల్లో పర్యటించి స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా టీడీపీ గ్రామ అధ్యక్షుడు పరసా కృష్ణ, నాయకులు రంగిశెట్టి గోవర్ధనరావు, చింతగుంట నాగబాబు, మరీదు వీరరాఘవరావు, లింగం వెంకటేశ్వరరావు, పరసా వేణు, నీలం రమేష్, శాయన రామారావు తదితరులు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు ప్రజల సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

లారీ ఢీకొని సైక్లిస్టు మృతి

కలిదిండి, జూలై 17(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని సైక్లిస్టు మృతి చెందిన ఘటన గురువారం కలిదిండి మండల రామిరెడ్డినగర్‌లో జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన ఆగరబొట్టి సత్తిబాబు(45) గురువారం ఉదయం ఏలూరుపాడు నుంచి గుర్వాయిపాలెం సైకిల్‌పై వెళ్లి కోళ్ల ఫారంలో కోడి పిల్లలను కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా రామిరెడ్డినగర్ వద్ద వెనుక నుంచి బియ్యపు లోడు లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలి

నూజివీడు, జూలై 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్‌కు ఇబ్బందికరంగా మారిని యాప్స్‌ను నిలిపివేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని ఏలూరు జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా నాయకురాలు మాణిక్యం డిమాండ్ చేశారు. గురువారం నూజివీడులో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ మహాసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మిని అంగన్‌వాడీలలో ఇబ్బందులను తొలగించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం చొరవ చూపి సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధం అవుతున్నట్లు హెచ్చరించారు. మహాసభ సందర్భంగా 21 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శుభశేఖర్

పోక్సో, మహిళా చట్టాలపై అవగాహన

ఆగిరిపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : చదువుకు మించిన మరేది లేదని, విద్యార్థులు ఉన్నత చదువులతో స్థిరపడాలని ఎస్ఐ శుభశేఖర్ సూచించారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్ ఆదేశాల మేరకు సైబర్ నేరాలు, పోక్సో యాక్ట్, మహిళల భద్రత చట్టాలపైన, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఆగిరిపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సోషల్ మీడియా మాధ్యమాలలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోకూడదని సూచించారు. మాదకద్రవ్యాలను వినియోగించిన, విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ నెట్‌వర్క్‌లను అవసరం మేరకు వాడాలని సూచించారు.





కైకలూరులో గోవిందమాంబకు.. రావిచెర్లలో గంగానమ్మ, సీతమ్మ వార్లకు ఆషాఢ సారె సమర్పించిన మహిళలు

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ

కైకలూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారికి, కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వున్న గోవిందమాంబ అమ్మవార్లకు మహిళలు పెద్దఎత్తున ఆషాఢం సారెను అందజేశారు. గురువారం వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మహిళా భక్తసమాజం ఆషాఢ సారెను అమ్మవార్లకు అందజేశారు. మేళతాళాలతో ఊరేగింపుగా సారెను అందించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

● నూజివీడు టౌన్ : నూజివీడు మండలం రావిచెర్ల గ్రామంలోని మహిళలు ఆషాఢ మాస ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలోని ఆలయాల్లో అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పించారు. తొలుత గ్రామ దేవత గంగానమ్మకు సారె సమర్పించిన మహిళలు అనంతరం గ్రామ ఉత్సవం నిర్వహిస్తూ రామాలయంలోని సీతమ్మకు సారె సమర్పించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, విజయవాడ-4 బ్రాంచ్ వారు ది. **22-06-2025**న ప్రచురించిన **ముద్రబోయిన కోటేశ్వరరావు** గారి యాడ్‌లో పొరపాటున 2వ షెడ్యూలు పడలేదు దానిని ఈ క్రింది విధంగా చదువ కొనగలరు. **షెడ్యూలు :** యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, విజయవాడ-1 టౌన్, మల్లికార్జునపేట, అకులవారివీధిలో యున్నట్టి మునిసిపల్ వార్డు నెం. 11ఎ, ప్రస్తుత మునిసిపల్ వార్డు నెం.25, రెవెన్యూ వార్డు నెం.1, బ్లాక్ నెం. 12, యన్.టి.యస్.నెం. 839, పాత అసెస్‌మెంట్ నెం. 1241ఎ, కొత్త అసెస్‌మెంట్ నెం. 18203, ప్రస్తుత అసెస్‌మెంట్ నెం. 1073008119, డోర్ నెం. 10-13-30కు దాఖలా పై తెలిపిన విధముగా నాకు సంక్రమించి యీ రోజున నీకు దఖలు పర్చి నీ స్వాధీనపర్చిన చ.గ. 33-0లు స్థిరాస్తికి హద్దులు **తూర్పు :** కర్నాటి నరసమ్మ గారి ఆస్తి, **దక్షిణం :** మునిసిపల్ రోడ్డు, **పడమర :** పాదరబోయిన కోటేశ్వరరావు గారి ఆస్తి, **ఉత్తరం :** కర్రా శ్రీనివాసరావు గారి ఆస్తి. ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 33-0లు లేక చ.మీ. 27-59కు స్థిరాస్తి నివేశన స్థలముమ్నూ, యిందలి గ్రౌండ్ ఫ్లోరు దాబా మరియు ఫస్టు ఫ్లోర్ రేకుల షెడ్డుతో సహాయున్నూ. DOC NO : 3986/2025, S.R.O. విజయవాడ.

Y.VIJAYAKUMAR, Advocate,
Door No.20-4-21, Near Lotus Land Mark,
Santhinagar, Vijayawada-3, Cell No. 9949077010